# కబీరుదాసు

## (నాటకం)

✶ ఈ నాటకం కన్నడ భాషలోకి అనువదింపబడి కర్నాటక రాష్ట్రంలో అనేక ప్రదర్శనలకు నోచుకుంటున్నది

# కబీరుదాసు

**(నాటకం)**

## ప్రదర్శించిన స్థలాలు

ఈ నాటకాన్ని రసరంజని సమాజంవారు మన రాష్ట్రంలోని హైద్రాబాద్, (8 సార్లు), విజయవాడలలోనే కాకుండా మైసూరు, కోల్‌కతాలో కూడా ప్రదర్శించడం జరిగింది. రసరంజని సంస్థలో నటించిన కళాకారుల వివరాలు

వ్యాఖ్యాత : **చాట్ల శ్రీరాములు** దర్శకత్వం : **దుగ్గిరాల సోమేశ్వరరావు**

సూత్రదారుడు :

| **పాత్రలు** | | **పాత్రధారులు** |
|---|---|---|
| కబీరుదాసు | - | మిక్కిలి ఫ్రాన్సిస్ |
| కబీరు తండ్రి నీరూ | - | బి. నారాయణ/దుగ్గిరాల సోమేశ్వరరావు/ యన్.యస్. రామశాస్త్రి |
| కబీరు తల్లి | - | కె. విజయలక్ష్మి/ఇందిర |
| కబీరు భార్య లోయీ | - | అంజుశ్రీ/రాజేశ్వరి/సురభి ప్రభావతి |
| తులసీరాం | - | జి.బి. రామక్రిష్ణ శాస్త్రి/బి. నారాయణ |
| కరీముల్లా | - | కె. నటరాజ్ |
| కరీముల్లా భార్య | - | శ్రీ లక్ష్మి |
| కరీముల్లా పెద్దకొడుకు | - | సి.హెచ్.వి.వి. సత్యన్నారాయణమూర్తి/ ఎ.వి.వి.టి.రావు/మౌని |
| కరీముల్లా చిన్న కొడుకు | - | ఎమ్.వి. కుటుంబ శర్మ/ధనుష్ |
| కరీముల్లా నౌకరు | - | రాజ్‌కిరణ్/బి.హెచ్. వేణుగోపాలరావు |
| బ్రహ్మణుడు | - | గోపరాజు రమణ/షఫి |
| రామానందులు | - | ఎమ్.కె.ఎస్. శయన/యం. కామేశ్వరరావు |
| జ్ఞానదేవ్ | - | ఎమ్. కామేశ్వర రావు |
| నామదేవ్ | - | సి. నారాయణ స్వామి |
| హిందువు - 1 | - | వై. మల్లికార్జునం/యం.వి. కుటుంబ శర్మ |
| హిందువు - 2 | - | రాజ్‌కిరణ్/మహేష్ |
| హిందువు - 3 | - | వెంపటి రాధాక్రిష్ణ/సి. నారాయణస్వామి |
| ముస్లిం -1 | - | ఎస్. కామేశ్వర శర్మ |
| ముస్లిం - 2 | - | సి.హెచ్. వేణుగోపాల్ |
| ముస్లిం - 3 | - | శ్రీనివాస్/వంశీ |
| రాముడు | - | మైమ్ మధు/శ్రీనివాస్ |

## సాంకేతిక వర్గం

| | | |
|---|---|---|
| సంగీతం | - | టి. రాజబాబు/శ్రీనివాస్ |
| రంగాలంకరణ | - | సురభిరాయలు/నాగుబాబు/రామశంకర శర్మ |
| ఆహార్యము | - | పరమేశ్ |
| తబల | - | రాజు |
| స్టేజి మేనేజింగ్ | - | వెంపటి రాధాకృష్ణ/ సి. నారాయణస్వామి |

# కబీరుదాసు

## (నాటకం)

## 1వ రంగం

(కబీరుదాసు ఇంటిముందు భాగం. లోపలి నుండి ఏడుపులు విన్పిస్తున్నాయి. ముస్లింలు, మరికొంతమంది హిందువులు రెండు గుంపులుగా నిలబడి వున్నారు. ఇరుగు పొరుగువారు లోపలికి వెళ్ళి విషాదవదనాలతో తిరిగొస్తున్నారు.)

**1 హిందు** : కబీరు ఎంత అదృష్టవంతుడు. ఏ బాధా అనుభవించకుండా కన్ను మూసాడు.

**2 హిందు** : ఇంతకూ ఎప్పుడు పోయాట్ట!

**1 హిందు** : రాత్రి భజనచేస్తూ చేస్తూ ప్రక్కకు ఒరిగిపోయాట్ట. మృత్యువు ఎలా ముంచుకొస్తుందో చెప్పలేం కదా! రామరామ అంటూనే రామునిలో కలిసిపోయాడు.

**2 హిందు** : రామునిలో ఎలా కలుస్తాడు. కలిస్తే గిలిస్తే అల్లాలో కలుసుంటాడు, రామునిమీద ఎన్ని పాటలు పాడినా పెంపకం – పెంచిందెవరు? అది మర్చిపోవద్దు.

**1 ముస్లిం** : యా అల్లా! ఎంత ఘోరం! ఎంతఘోరం! ఇప్పుడాయన బీబీ, బచ్చాలకు ఏమిటి ఘతి! య్యా అల్లా! ఆ కుటుంబానికి నువ్వేదిక్కు.

**2 ముస్లి** : అల్లా ఎందుక్కు దిక్కు అవుతాడు బాయ్! బతికినన్నాళ్ళూ రాము రాము అని పాడిన వాడికి, చచ్చిపోయాక అల్లా యెలా దిక్కు అవుతాడు భాయి! ఛుప్‌రహో! (లోపలినుండి కరీముల్లా, తులసీరాం కన్నీళ్ళు తుడుచుకుంటూ వచ్చారు) (కరీముల్లా తోటి ముస్లింమ్‌ల దగ్గరకు వెళ్ళాడు)

**కరీం** : సలామాలేఖుం సాబ్!

**1 ముస్లిం** : వా లేఖుం సలామ్!

**కరీ** : ఘోరం జర్గిపోయింది భాయీసాబ్! గుర్వుగారు మనకిక లేరు.

**2 ముస్లి** : ఏం చేస్తాం కరీముల్లా! అతను తినవలసిన గింజలు అయిపోయినాయి.

**కరీం** : గురువుగారిని ఖబరస్తాన్‌కి తీస్కుపోయే ఏర్పాట్లు చేయాలి భాయ్!

**1 ముస్లిం** : ఎక్కడికి? ఖబరస్తాన్‌కా? క్యాభాయ్! ఏం మాట్లాడుతున్నావో స్పృహ ఉందా? ఖబరస్తాన్‌కి ఎట్లా పోతా? ఏనైహోతా!

**కరీం** : అదేంటి భాయ్! సాటి ముసల్మాన్ చనిపోతే సానుభూతి లేదా మీకు.

2 ముస్లిం : క్యా బోలా! కబీర్‌దాస్ ముసల్మానా? నహీ! కరీంభాయ్! నై! ఏ ముసల్మాన్ నహి.

కరీం : ఎందుక్కాదు?

1 ముస్లిం : ఎందుకు అవుతుందో నువ్వు చెప్పు. అతడేమైనా మన మతంలో పుట్టాడా?

కరీం : కానీ మనమతంలో పెరిగాడు. మన మతస్థుడు పెంచాడు.

2 ముస్లిం : పెంచాడు, మన మతస్థులు పక్షుల్ని, పశువుల్ని కూడా పెంచుతారు. అలాగని అవి చచ్చిపోయినప్పుడు ఖబరస్తాన్‌కి తీసుకెళ్తామా భాయ్! (మరో ప్రక్క తులసీరాం హిందువుల్ని బ్రతిమిలాడుతున్నాడు)

తు.రాం : అతడ్ని ఒక ముస్లిం పెంచి వుండొచ్చు. అంతమాత్రాన గురువుగారు హిందువు కాదనటం భావ్యమా! అతనికి అంతిమ సంస్కారం చేయటం మనధర్మం కాదా?

1 హిందు : ధర్మాధర్మాలు మాకు నువ్వు చెప్తావా? ఓ మనిషికి కులం, మతం ఎలా వస్తాయో నీకేమైనా తెలుసా? జన్మతః వస్తాయి. అతడి పుట్టుక గురించి ఎవరికయినా తెలిసి చచ్చిందా? ఏది తెలిసి చావకుండా, చచ్చిన వాడికి హిందూధర్మం ప్రకారం సంస్కారాలు ఎలా చేసి చావమంటావ్

2 హిందు : మీరన్నట్టు పుట్టుక గురించి ఎవ్వరికీ తెలీదు. ఇక తెల్సిందల్లా ఏమిటంటే ముస్లిం పెంచాడని. అవునా! వాళ్ళ పద్ధతుల్లో పెరిగాడు. వాళ్ళు తినే అడ్డమైనదీ తిన్నాడు. జీవితాంతం వాళ్ళలాగే వున్నాడు. ఇహ హిందువులా ఎప్పుడు తగలడ్డాడని.

1 హిందు : అంత అపసవ్యమైన మతంలో పెరిగి చచ్చిన తర్వాత, కర్మకాండలు సవ్యంగా జరపాలని అనుకోవటం ఏంటి తులసీ! ఏదో ఒకలా కానిచ్చెయ్యకుండా! అదిగో సాయిబులు గుంపులు గుంపులుగా దిగిపోతున్నారుగా. వాళ్ళనే ఏదోలాగ కానిచ్చెయ్యమను. ఏదో తినే వస్తువుని పెట్టేలో పెట్టి దాచుకుంటారు, చూడూ! అలా కబీరు దాస్‌ని దాచుకోమను. (మరో ప్రక్క కరీముల్లా ముస్లింలను బ్రతిమాలుతూ వాళ్ళకాళ్ళమీద పడుతున్నాడు)

1 ముస్లిం : అరేభాయ్! మాది కాళ్మీదపడితే మేము ఏంచేస్తాం భాయ్! కాఫిర్లు అంటారు చూడు! ఏదీ ఆవుతోక పట్టుకుంటే స్వర్గంలోకి పోతారని. అలా ఒక ఆవుమీద ఎక్కించి కబీరుని వాళ్ళ స్వర్గానికి పంపమను.

(ఇప్పుడు హిందువులు, ముస్లింలు ఎదురెదురయ్యారు)

**హిందు** : ఏంట్రా మా పద్ధతుల్ని, సాంప్రదాయాల్ని విమర్శిస్తున్నారు?

**ముస్లిం** : మీదొక పద్ధతీ, సాంప్రదాయం! ఎవరైనా వింటే నవ్వి పోతారు.

**2 ముస్లిం** : ఏమిటి మీ సంప్రదాయం? రాళ్ళకు మొక్కడమా? బురద నీటిలో పవిత్ర స్నానాలు చెయ్యడమా? కులాల పేరుతో మనుష్యుల్ని విడదీయటమా? ఇవేగా మీ సాంప్రదాయాలు?

**హిందు** : ఇదిగో వీటన్నిటిని తెగనాడింది, తూలనాడింది ఈ కబీర్‌దాస్. అతడు చెప్పిన మాటలవల్లే మన మతం ఈ సాయిబుల దృష్టిలో చులకనైపోయింది. అలాంటి హిందూ మతద్వేషికి ఇప్పుడు మన మతాచారం ప్రకారం అంత్యక్రియలు జరపడమా? కుదరదు. ఆ సాయిబుల్ని నెత్తినెక్కించుకున్నాడు కాబట్టి వాళ్ళనే చెయ్యమనండి.

**1 ము** : మమ్మల్ని నెత్తికెక్కించుకోలేదు. మా నెత్తికెక్కి కూర్చున్నాడు. అల్లా ఏమైనా చెవిటివాడా మసీదుల్లోంచి అరచి మరీ పిలుస్తున్నారని హేళన చేసాడు. నమాజులెందుకన్నాడు. రోజాలు వద్దన్నాడు.

**2 ము** : మా తిండి తిని మా మతాన్ని అగౌరవపరచాడు. పెంచిన విశ్వాసం కూడా లేదు ఈ మనిషికి.

**1 ము** : ఎంత గొప్ప మతంలో పెరిగినా పుట్టిన మతం తాలూకా నీచపు బుద్ధులు ఎక్కడికిపోతాయి?

**హిం** : అంటే ఏమిట్రా! మాది నీచమైన మతమా?

**ముస్లిం** : అది కబీరుని చూస్తేనే తెల్సిపోతుంది. మీ మతం గొప్పతనం.

**హిం** : కబీరుని చూస్తే తెలిసేది. మీ మతం తాలూకా గుణాలే. కబీర్ మావాడు కాదు. మీవాడే – అతనో ముసల్మాన్. అతను దహన సంస్కారాలకు అనర్హుడు. పంచభూతాల్లోని అతిపవిత్రమైన అగ్ని అతనిదేహాన్ని దహించకూడదు. శాస్త్ర విరుద్ధంగా దహిస్తే, గాలి, నీరు, నింగి కలుషితమైపోతాయి. కాబట్టి అతన్ని, అతనితోపాటు ఆయన వేదాంతాన్ని, సిద్ధాంతాల్ని పెట్టెలో పెట్టి ఖననం చేసెయ్యండి. కబీరన్నవాడు ఈ వేద భూమ్మీద కొన్నాళ్ళు జీవించాడనే సత్యాన్ని ఆ శవంతో పాటు భూస్థాపితం చేసెయ్యండి. పీడా విరుగడై పోతుంది. పదండి పోదాం! (వెళ్ళిపోయారు)

**ముస్లిం** : పొగరుబోతు కాఫిర్లు, హమేషా రామభజనచేస్తూ, తననా బునానా నభూతాజోహై కబీర్ హరీకా నామ్ లిఖిలియా శరీర్ – అని గొప్పగా చెప్పుకున్నాడు. అంటే ఈ కబీర్ నూలు వడుకు పనిని, నేత పనిని

మానేశాడు. అతని శరీరంపై హరినామం ముద్రితమై వుంది అని బడాయిలు చెప్పాడు. హరిమనవాడు కానప్పుడు హరినామం ముద్రితమైన కబీర్ శరీరం మనది ఎలా అవుతుంది. చలో! చలో! అల్లా దృష్టిలో మనం చెడ్డవారం కాకూడదు. చలో.

**కరీం** : యా అల్లా! ఏమిటీ పరీక్ష? గురువుగారు చెప్పింది ఏమిటి? వీళ్ళు అర్థం చేసుకున్నదేమిటి?

**తులసీ** : మా మతంలో వున్న అర్థరహితమైన ఆచారాల్ని, కర్మకాండల్ని అసమంజసమైన సంస్కారాల్ని కూడా విమర్శించారు.

**కరీం** : మా మతంలో వున్న మూర్ఖత్వాన్ని, ఛాందస భావాల్ని విడిచిపెట్టమని ప్రభోదించారు. అది నేరమా? రాముడు నిర్గుణుడని, నిరాకారుడని అతని విశ్వాసం.

**తులసీ** : ఆ రాముడికీ, రహీంకి తేడా లేదని చెప్పారు. అది ఈ చెవిటి వాళ్ళకు విన్పించలేదా?

**కరీ** : నిజమ్! చెవిటివాడు మాటవినలేని వాడుకాడు – మంచిమాటను వినిపించుకోనివాడు. ఈ చెవిటి వాళ్ళంతా కల్సి కబీర్ మావాడు కాదంటే అతను ముస్లిం కాకుండా పోతాడా?

**తులసీ** : నిత్యం రామనామ స్మరణ చేస్తూ ఎన్నో పుణ్యక్షేత్రాలు తిరిగేరే? గ్రుడ్డివాళ్ళైన ఈ హిందువులది చూడలేదా? ఆయన అవలంబించిన మత సామరస్యాన్ని, ప్రబోధించిన విశ్వమానవ ప్రేమతత్వాన్ని చూడనివ్వకుండా ఈ హిందువులకు అహంకారమనే అంధత్వం అడ్డుపడుతోందా?

**కరీం** : భయ్యా! గురువుగారు ఎలా బ్రతికారో, ఏ విలువల కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేసారో వాళ్ళకర్థమయ్యేటట్టు వినిపిద్దాం భయ్యా!

**తులసీ** : అవును. వినండి.

నిరంతర జ్ఞానాన్వేషణలో సత్యాన్ని శోధిస్తూ, సత్యతత్వాన్ని సాధిస్తూ అజరామరంగా నిలచిపోయే ఆధ్యాత్మిక అమృతవాక్కులను ప్రసాదించిన పుణ్యమూర్తి గురువుగారు. ప్రపంచమంతా ప్రేమమయం కావడానికి అవసరమైన ఆత్మపరిశీలన దృష్టిని లోకానికి తెలియజేసిన పవిత్రమూర్తి కబీర్‌దాసుగారు. మేము చెప్పిందంతా విని మీరే నిర్ణయించండి. ఆయన ఒక ముస్లిమా? హిందువా? అనేది

లైట్సాఫ్

# రెండవ రంగం

**వ్యాఖ్యాత** : రామ గాన మాధుర్యంలో తేలియాడిన మహాభక్త యోగి కబీరుదాసు. నిజానికి కబీరుదాసు కులమేమిటో, గోత్రమేమిటో ఎవరికీ తెలియదు. కబీరుదాసు పసివాడుగా వున్నప్పుడు గంగాతీరంలో 'నీరూ' అనే మహమ్మదీయునికి దొరికాడు. భగవంతుడిచ్చిన ప్రసాదంగా భావించి నీరూ దంపతులు ఆ పసివాడికి 'కబీర్‌దాస్' అని పేరు పెట్టుకుని అల్లారుముద్దుగా పెంచుకున్నారు. వయసుతోపాటు కబీరులో జ్ఞానతృష్ణ పెరిగిపోయింది. ఇటు హిందూ ధర్మశాస్త్రాలు తెల్సుకున్నాడు. అటు 'ఖురాన్' ని నేర్చుకున్నాడు. అయినా అతనిలో తపన అంతకంతకు పెరిగిందే తప్ప తరగలేదు. జ్ఞానోపదేశం కోసం ఎందరినో ఆశ్రయించాడు. కులవాదంతో అహంకారం ఆవరించిన హిందూమత ఛాందసులు అతడు ముస్లిం అని నిరాకరించారు. ముస్లింల ఇంట పెరిగినా ఇతడి ప్రవర్తన హిందువులావుందనీ, ఇస్లాం మతానికి వ్యతిరేకి అనీ ముస్లిం మత గురువులు అతడిని బహిష్కరించారు. దాంతో ఏ మతానికి చెందని మూడో వ్యక్తిగా కబీర్‌దాస్ మిగిలిపోయాడు. అయినా అతడిలో వెల్లువెత్తుతున్న జ్ఞానతృష్ణ వరదలా అతడిని ముంచెత్తుతోంది. నిరంతర ఆవేదనలో నలిగిపోతున్నాడు. ఆత్మజ్ఞానం ఎలా పొందాలి? దాన్ని తెలిపే సద్గురువు ఎవరు! అన్నదే అతని అన్వేషణ.

లైట్స్ ఆన్

(కనిపించేది గంగాతీరం.. కబీరుదాసు క్రింద కూర్చొని వున్నాడు. అతని తల్లిదండ్రులు వెతుక్కుంటూ వచ్చారు)

**నీరూ** : బేటా! కబీరూ! ఇక్కడేం చేస్తున్నావ్! నిర్మానుష్యమైన ఈ నదీతీరంలో నీకేం పనయ్యా!

**తల్లి** : రెండు రోజులుగా ఇంటికి కూడా రాకుండా ఇక్కడున్నావేం నాయనా! నీవేమైపోయావో అని ఎంత తల్లడిల్లిపోయామో తెలుసా?

**కబీ** : ఎందుకమ్మా! నా గురించి మీకంత చింత?

**తల్లి** : అదేంమాట బేటా!... తల్లిదండ్రులకు బిడ్డలపట్ల ఆమాత్రం చింత వుండటం సహజమే గదా నాయనా!

**కబీ** : కస్త్వం కోహం కుత ఆయాతః
కమే జననీ కోమే తాతః

ఇతి పరిభావయ సర్వమసారం

విశ్వంత్యక్త్వాస్వప్నవిచారం

తల్లి, తండ్రి, కొడుకు, జననం, మరణం, బంధాలు ఇదే ప్రపంచమా?.. ఇదంతా ఆలోచిస్తే ఈ జీవితమే ఒక కలలాంటిది కదమ్మా. దీనికోసం ఏం తాపత్రయపడాలి? సాధించాల్సింది వేరే వుంది. ఇవన్నీ మాయాబంధాలు మాత్రమే. దీనికతీతమైన అలౌకికబంధం వేరేవుంది. అదే తెలుసుకోవాలి.

**నీరూ** : బేటా! నీ మాటలు మాకేం అర్థం కావటంలేదు.

**కబీ** : నాకు నేనే అర్థం కావటం లేదు బాబా! ఇక నా మాటలు మీకెలా అర్థమవుతాయి!

**తల్లి** : నీ మాటలు వింటూవుంటే మాకేదోభయంగా వుంది బేటా!... పద ఇంటికెళ్దాం. ... ఒంటరిగా ఇక్కడేం చేస్తావు?

**కబీ** : అమ్మా! ఇల్లు, బంధాలు ఇవన్నీ మనం నిర్మించుకున్నవి. ఆ భగవంతుడు మనకోసం నిర్మించిన బంధం వేరొకటి వుందమ్మా.... దానికోసమే వెతుకుతున్నాను.

**నీరూ** : ఇక్కడ కూచుంటే అది కనబడుతుందా?

**కబీ** : మరెక్కడ కనబడుతుంది బాబా?... నాకు కావల్సిన ఆత్మజ్ఞానం ఎక్కడ కనిపిస్తుంది బాబా!

**నీరు** : చూసావా! వద్దు వద్దు అంటున్నా వినకుండా అతిగా గారాబం చేసావు. ఇపుడు వాడి పరిస్థితి చూడు ముసలి వయసులో చేతి కర్ర అవుతాడనుకున్న బిడ్డడు నీగారాబంతో కొరకరాని కొయ్యలా తయారయ్యాడు.

**తల్లి** : బేటా కబీర్! మీ బాబాను చూడు – రాత్రింబగళ్లు వస్త్రాలు నేసి, నేసి ఎలా నీరసించిపోయాడో – నిన్ను ఆ భగవంతుడి వరంగా భావించి పెంచుకున్నాము. ఈ ముసలి వయసులో మమ్మల్ని క్షోభ పెట్టడం బాగుందా నాయనా! ఇంటికి వెళదాం పద.. రా తండ్రీ!

**కబీ** : నిజమేనమ్మా! కొడుకుగా మిమ్మల్ని సంతోషపెట్టాల్సిన బాధ్యత నామీద వుంది. కానీ... ప్రస్తుతం నా మనసు నామాట వినడంలేదు. నేనెవరో నాకర్తవ్యమేమిటో తెలియజేసే సద్గురువు కోసం వెదుకుతున్నాను. గురువు లభించాక ఆయన వద్ద దివ్యోపదేశం పొందిన పిదప నేను మీ వద్దకే వస్తాను. అంతవరకు నన్ను క్షమించండి (చేతులు జోడించాడు)

నీరూ : (నిట్టూర్చి) బేటా! నీలోని జ్ఞానతృష్ణకు సంతోషించాలో – బాధ పడాలో తెలియని స్థితిమాది... (భార్యతో) వీడికోరిక నెరవేరిందాకా ఇంటికిరాడు. త్వరలోనే ఆ కోర్కె నెరవేరాలని అల్లాను ప్రార్థించటం తప్ప చేయగలిగిందేమీలేదు.. పదవెళదాం. (తల్లి దుఃఖం తండ్రి ఓదార్పు... ఇద్దరూ వెళ్ళిపోయారు)

కబీ : కౌన్ బతావే వాటీ గురుబిన్
కౌన్ బతావే వాటీ!
బడా వికటీ యమ ఘాటీ
కామక్రోథ దోపర్వత ఠాడే
లోభచోర సంఘాత్
మదమత్సర కామోంకీ బరసాత్
మాయాపవన్ బహేదాటి
కహతకబీర్ సునోభాయిసాధో
కీస్తరనా యహ్ ఘాటీ!

యమపాశం చాలా భయంకరమైనది. కామక్రోధాది పర్వతములు అడ్డుగా నిలిచి జీవన నౌకాయానమును నిరోధించుచున్నవి. మరొకతీరమును చేరదామంటే అక్కడ దోచుకోవటానికి లోభం సిద్ధంగా వుంది. మద మాత్సర్యాలనే జల్లులు నౌకమీది పడుతున్నాయి. మాయగాలులు వీస్తున్నాయి. ఇట్టి పరిస్థితుల్లో గురువుతప్ప నన్ను కాపాడేదెవరు? (కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తున్నాడు. అలా చేస్తూ, చేస్తూ నిస్త్రాణంగా ఒరగిపోయాడు నేలమీదకు – రామానందస్వామి రామనామభజన చేస్తూ నదీతీరం వైపు నడిచాడు. కబీరు నేలమీద పడివున్నాడు. రామానందుడు అతడిని గమనించక కబీరుపై కాలు వేసి దాటారు. కబీరు మూలిగాడు)

రామా : (కబీరును గమనించి).... అయ్యో! ఎంతపనిజరిగింది! కన్నుగానక ఈ అభాగ్యుడిపై పాదం మోపానే – రామా!... రామా!... (కబీరు లేచి అంతా విన్నాడు. ఆనందపడ్డాడు. వెంటనే అతడి కాళ్ళపై బడి పాదాలు గట్టిగా పట్టుకున్నాడు.)

కబీ : ఆ! ఆ! అదే నాకు కావల్సింది. నా జన్మ ధన్యమైపోయింది. పవిత్ర రామనామంతో నాకు జ్ఞానోదయం అయ్యింది. ఇన్నాళ్ళకు నేను వెదుకుతున్న సద్గురువు నాకు లభించాడు. స్వామీ... స్వామీ....

రామా : లేనాయనా!.... (లేచాడు కబీరు)

కబీ : స్వామీ! తమరెవరో గాని దైవంలా తారసపడ్డారు. ఇన్నాళ్ళ నా శోధన నేటికి ఫలించింది. ఇక తమరే నాకు సద్గురువులు. తమరెవరు? ఎక్కడ నుండి వస్తున్నారు?

రామా : నన్ను రామానందులంటారు.

కబీ : ఆఁ... తమరు రామానందులవారా?... మహాజ్ఞాని... మహాభక్తుడు అయిన రామానందులవారి పాదస్పర్శతో నేడు నా నిరీక్షణ ఫలించింది. స్వామీ! నా పేరు కబీరుదాస్... నన్ను తమ శిష్యుడిగా స్వీకరించమని సవినయంగా వేడుకుంటున్నాను.

రామా : మా వద్ద శిష్యరికం మహాకఠోరమైంది నాయనా!

కబీ : పాప భూయిష్టమైన మానవజన్మకన్న కఠోరతరమైనది ఏమున్నది స్వామీ! మీవంటి సద్గురువు సేవతో జన్మరాహిత్యం కలిగితే అది మహదానందమేకద!

రామా : నీ తపన చూస్తుంటే భలే ముచ్చటగా వుంది. రా నాయనా! నీకు మంత్రోపదేశం చేస్తాను.

కబీ : (ఆనందంగా నమస్కరించి) ఆహా ఎంత అదృష్టం. మహమ్మదీయునికి మంత్రోపదేశమా? శాస్త్రం సమ్మతిస్తుందా?

రామా : ఏ శాస్త్రమైనా మనిషిని చైతన్య పరచి జ్ఞానవంతుడిగా మార్చమన్నదేగాని కులమతాల పేరున వేరుచేయమనలేదు. మహమ్మదీయుడైనంత మాత్రాన మంత్రోపదేశానికి అనర్హునడటం శాస్త్ర విరుద్ధం నాయనా! (కబీరు లేచి ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆయన మంత్రోపదేశం చేశాడు.)

కబీ : నేడుకదా నా జన్మ తరించింది. ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి గురుదేవా!

రామా : నాయనా! ఈ ప్రపంచానికి నీవు చేయాల్సిన మంచిపని ఒకటుంది.

కబీ : ఏమిటో చెప్పండి స్వామీ!

రామా : ఉత్తమ మానవుడు తేనెటీగవంటివాడు. తేనెటీగ తాను సేకరించిన తేనె ఇతరులు అనుభవించటానికే కూడబెడుతుంది. జ్ఞానికూడా తాను సముపార్జించుకున్న జ్ఞానం ఇతరులకు పంచిపెడతాడు. నీవు అదే విధంగా నీ జ్ఞానధనాన్ని ఇతరులకు పంచిపెట్టు. అదే నేను కోరుకొనేది.

కబీ : మహద్భాగ్యం స్వామీ.... (మోకరిల్లాడు)

## మూడవ రంగం

**వ్యాఖ్యాత** : కబీర్‌దాస్ అత్యంత భక్తి శ్రద్ధలతో రామానందులవారి వద్ద సమస్త వేదాంత రహస్యాల్ని తెలుసుకున్నాడు. గొప్ప జ్ఞానిగా మారాడు. ప్రాపంచిక విషయాల్ని విస్మరించి రామనామ స్మరణలో మునిగితేలుతున్నాడు. అతడి తండ్రి నీరూ మరణించటంతో కుటుంబ భారం అతని నెత్తినపడింది.

లైట్స్ ఆన్

కబీరు ఇంటి అరుగుమీద కూర్చొని రామనామం గానం చేస్తున్నాడు. తల్లి ఆ పాట వింటూ పరవశురాలైపోతోంది. ఆ ధ్యానినిమగ్నతలో కళ్ళముందు రాముడు ప్రత్యక్షమైన భావనలోకి వెళ్ళిపోయింది. తల్లి దృక్కోణంలో రాముడు పాట కనుగుణంగా నర్తిస్తున్నాడు.

**తల్లి** : ఆహా! బేటా! నా నసీబ్ ఎంతబాగుంది బేటా! భక్తుడు పడుకుని పిలిస్తే దేవుడు కూర్చుని వింటాడన్నావు. కూర్చొని పలకరిస్తే నిలబడి పలుకుతాడన్నావు. పాట పాడితే నాట్యం చేస్తూ వస్తాడంటావు... ఎంత బాగుంది బేటా! ఎంత బాగుంది. (ఈ లోగా రాముడు ఒక ముసలి బ్రాహ్మణుడిగా మారిపోయాడు)

**రాముడు** : అమ్మా! ఓ అమ్మా!

**తల్లి** : ఎవరయ్యా అది. ఎవరది... అనవసరంగా కలచెదిరిపోయింది. ఎవరివయ్యా నువ్వు?

**రాముడు** : కలలు కనటం మానేసి కాస్త నిజాన్ని కూడా చూడమ్మా.

**తల్లి** : ఏం ఇది నిజంకాదా? నా బేటా భక్తి నిజం. రాముని రాక నిజం. ఇంతకన్న ప్రపంచంలో నిజమేముంటుంది స్వామి!

**రాముడు** : అన్నిటికన్నా ఆకలి అనే రోగం ఓ గొప్ప నిజం. ఆ రోగం తగ్గాలంటే ఆహారం అనే ఔషథం వెయ్యాలి. అది అన్నిటికన్నా ఇంకా గొప్ప నిజం.

**తల్లి** : తెల్సులే పంతులూ! మాకూ మూడు పూటలు ఆకలేస్తుంది. ఆకలేసినప్పుడు రోటి తింటున్నాం. అర్థమైందా?

**రాము** : నాకర్థమైంది. కానీ నీ కర్థం కానిదే ఒకటుంది.

**తల్లి** : నాకర్థం కానిదా? ఏమిటదీ?

**రాము** : ఏమిటంటే కొడుకు వ్యాపారమో, వ్యవసాయమో చేసుకుని ప్రయోజకుడైతే తల్లిదండ్రులు సంతోషిస్తారు. కానీ నువ్వేంటమ్మా! నీ

కొడుకు ఇలా అప్రయోజకుడుగా తయారయితే తగుదునమ్మా అని తెగ సంతోషపడిపోతున్నావ్! మనిషై పుట్టాక పనీపాటా చేసుకోవద్దూ?

**తల్లి** : నా బేటా హమేశా పనీపాటలోనే వుంటున్నాడు స్వామీ!

**రాము** : ఏంటి నీ కొడుకు నిత్యం పనీ పాటలోనే వుంటున్నాడా? ఆ మాట నీ కొడుకుని చూసే చెబుతున్నావా?

**తల్లి** : అవును – నా కొడుకును చూసే చెబుతున్నాను. మనసు రాముని మీద లగ్నం చేయటం అతను చేస్తున్న పని. రామనామ సంకీర్తనే అతడు పాడుతున్నపాట. ఇంతకన్నా ఎవరు మంచి పనీ – పాట చెయ్యగలరు చెప్పండి.

**రాము** : బాగానే వుంది. పాట విని రాముడు సంతోషిస్తాడు. కాని ఆహారం పడనిదే ఆత్మారాముడు సంతోషించడుగా. వాడి ఘోష ఎలా తీరుతుంది?

**తల్లి** : చూడయ్యా! నా కొడుకు రామభక్తిలో బుడిబుడి అడుగులు వేసే బుడతడు. వాడికింత తిండి పెట్టలేనా స్వామీ! నేనున్నంత వరకు మా కబీరుకు తిండికి లోటురాదు.

**రాము** : సరిగ్గా నామాటా అదే. నువ్వున్నంత వరకు కబీరుకి ఏలోటూ రాదమ్మా. ఆ తర్వాత?

**తల్లి** : అంటే?

**రాము** : అంటే నీ కొడుకు కోసమని నువ్వు ఎల్లకాలం ఈ భూమ్మీద వుండవుగా. నువ్వు పోయాక కబీరెలా బ్రతుకుతాడు? ఏంతిని బ్రతుకుతాడు! నువ్వుండగానే అతనికేదో పని నేర్పాలికదా. ఇంత వయసొచ్చినా నీకామాత్రం జ్ఞానం లేకపోలే ఎలా చెప్పమ్మా?

**తల్లి** : అంటే నేను పోయాక కబీర్‌కి ఎవరూ తిండి పెట్టరా?

**రాము** : ఎవరు పెడతారు చెప్పమ్మా. ఈ రోజుల్లో స్వంత తల్లిదండ్రులకే పిల్లలు తిండి పెట్టడం లేదు. వేరెవరో ఎందుకు పెడతారు?

**తల్లి** : కబీరు చెప్పే మంచిమాటలు, ఆపాడే తీయని పాటలు విని ఎవరయినా ఇంత ముద్ద పెట్టరంటావా నాయనా!

**రాము** : ఎందుకు పెడతారమ్మా – మాయమాటలు చెప్పి బ్రతికే వారికి ఎవరయినా పెడతారు. మంచి మాటలు చెప్పే వారికి ఎవరు పెడతారు? మంచితనం కూడుపెట్టదని పెద్దలు వూరికే అన్నారా? పైగా మన కబీరేమయినా సామాన్యుడా? కలుషితాన్ని కత్తిపట్టుకుని

నరుకుతున్నాడు. మతాన్ని మానవత్వంతో ఎండగడుతున్నాడు. నిజాన్ని నిప్పురవ్వలా వదుల్తున్నాడు. యధార్థవాదీ లోకవిరోధీ అని వినలేదా?

తల్లి : లేదు. నా బిడ్డ లోకహితుడు. వాడికే అపకారం జరగదు. వాడి జీవితం ఏలోటులేకుండా సాగిపోతుంది.

రాము : అయ్యో పిచ్చితల్లీ! నీ కొడుకు లోకహితుడే. కానీ లోకులకు ఆ విషయం తెలియదు. నీకొక్క మాట చెప్పనా! చూపు విలువ గ్రుడ్డితనం వచ్చాక కానీ తెలియదు. చీకటి ఎంత భయంకరమైందో దీపం ఆరిపోయాకగానీ తెలిసిరాదు. అలాగే కబీరు ఎంతగొప్పవాడో ఈ తరానికి తెలీదు. వాళ్లెవ్వరూ అతనికేవీ పెట్టరుగానీ నువ్వు బ్రతికుండగానే నువ్వు అతన్ని దారిలో పెట్టి కాస్త పుణ్యంకట్టుకో.

తల్లి : అంతేనంటావా... వింటుంటే నీ మాటలే నిజమనిపిస్తున్నాయి. చెబుతాను. నా బేటా మనసు నేనే మారుస్తాను. బేటా! బేటా...!

రాము : ఇదిగో మాట.

తల్లి : మళ్లీ ఏంటి?

రాము : సోమరితనం ఒంటబట్టిన వాళ్ళు కాస్త గట్టిగా చెబితే తప్ప మాట వినరు. తల్లి ప్రేమను పక్కన బెట్టి చెవులకు తుప్పు వదిలించు.

తల్లి : ఆc.....ఆc..... తప్పక వదిలిస్తాను. కబీరూ... కబీరూ....

కబీ : ఏంటమ్మా!

తల్లి : నీ పిలుపులో ఎంత మాధుర్యముంది నాన్నా! ఏంలేదు – ఏంలేదు. నువ్వు ధ్యానం చేసుకో – (వెనక్కి వచ్చేసింది)

రాము : ఏంటమ్మా? అలా వచ్చేసావు?

తల్లి : ఏమో నాయనా! బిడ్డడ్ని ఎన్నడూ పన్నెత్తిమాటాడి ఎరగను. ఇప్పటికిప్పుడు.

రాము : అదిగో అదే వద్దంటున్నాను. మనసు గట్టిచేసుకుని కాస్త మందలించమ్మా.

తల్లి : సరే! (మళ్ళీ కబీరు దగ్గరకెళ్ళింది) కబీరు! కబీరూ!

కబీ : చెప్పమ్మా! ఏం చెప్పాలనుకుంటున్నావు?

తల్లి : ఇన్నాళ్ళు మీ నాన్న వున్నారు కనుక నువ్వేపని చెయ్యకపోయినా ఇల్లు గడిచిపోయింది. ఆయన మనల్ని వదలి అల్లాదగ్గరకు వెళ్ళిపోయాడు. ఇకనుండి నువ్వే మనింటికి ఆధారం.

| | | |
|---|---|---|
| **రాము** | : | (దూరం నుండి) చెప్పు! చెప్పు! |
| **కబీ** | : | ఏం ఇప్పుడు మనకేం తక్కువ. రత్నాలు మన ఇంట్లో రాసులు పోసివుండగా ఈ విచారమెందుకమ్మా. |
| **తల్లి** | : | ఏమిటి నాయనా! మనింట్లో రత్నాలున్నాయా? |
| **రాము** | : | రాశులుగా పోసి... |
| **కబీ** | : | లేకుండా ఎక్కడకు పోతాయమ్మా. వాటితోపాటు ముత్యాలు, వజ్రాలు, ఒకటేమిటమ్మా మన దగ్గరున్న సంపద ఇంకెవరిదగ్గరా లేదుకదమ్మా. |
| **తల్లి** | : | ఏంటి నాయనా! నీకేమైనా కలొచ్చిందా! లేకపోతే నీ పాటలు విని ఏ రాజైనా బహుమతిగా ఇవన్నీ ఇచ్చాడా? నిజమేంటో చెప్పవా కన్నా? |
| **కబీ** | : | నీకు తెలియని నిజమేముందమ్మా! రామనామ రత్నాలు రాశులుగా లేవా? మంచిమాటలు ముత్యాల మూటలుగా మనింట లేవా? కీర్తనలనే విలువయిన వజ్రాలు మనదగ్గర కాక ఇంకెక్కడున్నాయమ్మా.<br>కీర్తన –<br>నిర్ధనకేధన్ రామ్‌హమారే<br>చోరనలేవై ఘటహున జావై కష్టమె ఆవైకామ్.<br>దినదిన హోత బఢాయి దౌలత్ ఖడత్ నహిగోదామ్<br>జగత, సోవత, ఉఠత,<br>జపోనిరంతరనామ్ బైఠత<br>అంతకాలమె ఛోడచలత సబపాసన ఏక్‌ఛదామ్<br>కహతకబీర్‌రాంధనకే ఆగే పారసకోక్యానామ్<br>ధనములేని పేదవారికి రామనామమే ధనము. రామనామమనే సంపద పెరుగుతుందే కాని తరగదు. మెలకువనందు, నిద్రయందు కూడా నిరంతరం నామజపం చేయి. మృత్యువు సమీపించే సమయంలో అందరూ నిన్ను విడచి పెట్టేవారే కానీ, నీవెంట నడిచే వారొక్కరూ కనిపించరు, రాముడు తప్ప రామనామము ఎదుట పరుసవేది కూడా నిరుపయోగమే. |
| **తల్లి** | : | ఇవన్నీ మనిషిని బ్రతికిస్తాయా చెప్పు! తిండిలేకుండా మనం జీవించగలమా? దాన్ని సంపాదించుకోవాలికదా నాయనా! ఏదో ఒక పని చెయ్యాలి కదా కన్నా! |
| **కబీరు** | : | అమ్మా! ఈ దేహం ఒక దీపం. దానికి 'వత్తి' ప్రాణం. రక్తం తైలం. ఆ దీపకాంతిలో ఆత్మ, పరమాత్మల సమన్వయమే జీవించడం. ఇక తిండికోసం అంతప్రయాస పడాలంటావా? |

తల్లి : నీతో వాదించటం నావల్లకాదు. నువ్వు ఈ పాటలు, మాటలు కాస్త ప్రక్కనబెట్టి ఏదో ఒక పన్జెయ్యాలి. లేకపోతే నేనూరుకోను.

కబీ : నువ్వే చెప్పమ్మా! నేనేం చెయ్యాలో?

తల్లి : మన కులవృత్తి నేతపని. ఆ పని నువ్వు చేస్తే తప్ప! మన కుటుంబం గడవదునాన్నా.

కబీ : అలాగేనమ్మా! నువ్వన్నట్టే చేస్తాను.

తల్లి : (చాలా సంతోషపడింది) నాబాబే! నానాయనే! నాన్నా! మీ నాన్న చివరిసారిగా నేసిన చీరలున్నాయి. వాటిని అమ్మి సరుకులు తీసుకురా!

కబీరు : (మళ్ళీ పాట అందుకున్నాడు... తల్లి లోనకు వెళ్ళి చీరెలు తీసుకొచ్చింది)

తల్లి : ఇదిగో! ఒక్కో చీర ఖరీదు నాలుగణాలు, వీటిని అమ్మి అంగడి నుండి సరుకులు తీసుకురా!

కబీ : అలాగేనమ్మా! (కదులుతున్నాడు)

తల్లి : మధ్యాహ్నం నీకు భోజనం తీసుకొస్తాను. నేను వచ్చే వరకు అక్కడే వుండాలి. తెల్సిందా!

కబీ : అలాగే నమ్మా!

తల్లి : యా అల్లా! నా బిడ్డకు బుద్ధినిచ్చావు. అవునూ! ఈ పంతులెక్కడా?.. పంతులూ.. పంతులూ... (అని వెతుక్కుంటూ ఒకవైపు వెళ్ళింది. కబీరుదాసు బట్టల మూట నెత్తిన పెట్టుకుని బయల్దేరుతుండగా మరో వైపు నుండి రాముడు బ్రాహ్మణ వేషంలో వచ్చాడు.)

రాము : కబీరూ!

కబీ : ఏంస్వామీ!

రాము : నేను వేదవేదాంగాలు ఔపోసన పట్టిన పండితుడ్ని – కాలం కలసి రాక కుటుంబపోషణ కష్టంగా ఉంది. ఒక పూట తింటే నాలుగు పూటలు పస్తులుండే పరిస్థితి. తిండి మానుకోగలం గానీ – మానం కాపాడుకోకుండ ఉండలేము కదా! నా భార్యకు ఒకే ఒక చీర వుంది. రెండో చీర కూడా కొనలేని నిర్భాగ్య స్థితినాది! అందుకే చేతులు జోడించి మరీ అడుగుతున్నాను. ఒక్క చీర... ఒకే ఒక్క చీర దానం చేయగలవా కబీరూ.

కబీరు : ఎంతమాట స్వామీ... ఈ మాత్రం దానికి మీరింత ప్రాధేయ పడాలా? (ఒక చీరెను ఇచ్చాడు)

రాము : చల్లగా నూరేళ్ళు జీవించు కబీరూ!

కబీరు : అంతా రామాజ్ఞ

రాముడు : ప్రతిదానికి రాముడు రాముడు అంటావు. అందులో వున్న ఆనందమేమిటో నాకర్థం కాలేదు.

కబీరు : చూడు స్వామీ! మూగవాని సంజ్ఞలు మరో మూగవానికే అర్థమౌతాయి. భక్తుడి ఆనందం కూడా మరో భక్తునికే అర్థమౌతుంది. నన్ను వెళ్ళనివ్వండి. వస్త్రాలు అమ్మాలి.

రాము : ఒక్కమాట కబీరూ! దేవునికి దగ్గరగా వుండాలంటే లౌకిక బంధాల్ని త్రెంచుకోవాలా? దైవసాన్నిధ్యం కొరకు లోకం నుండి విముక్తి కావటం అంత అవసరమా?

కబీరు : పిచ్చిస్వామీ! నిన్ను పాము కఱచి పుట్టలో దూరిందనుకో, ఆ పాముని పట్టుకోటానికి ఏం చేస్తావు? పుట్టను త్రవ్వుతావు. నిన్ను కరచింది పాముకదా! పుట్ట జోలికెందుకెళ్తావు. అలాగే ఐహిక వాల్మీకం నుండి బయటపడకుండా ఆ ముష్మిక శిఖరాల్ని అందుకోలేవు. (కబీరు బయటికి వెళ్ళిపోయాడు).

రాము : ఆహాఁ ఈ భూమిమీద నిన్ను మించిన భాగవతోత్తముడు లేడయ్యా (బయటి నుండి కబీరు తల్లి వచ్చింది)

తల్లి : స్వామీ చూసారా! నా కొడుకు బట్టలు అమ్మటానికి ఇప్పుడే వెళ్ళాడు. వాడెంత సమర్థుడో మీకే అర్థమౌతుంది.

రాముడు : ఆఁ! ఆఁ! ఎంత సమర్థుడో నాకెప్పుడో అర్థమైంది. అదిగో ఆ కూడలిలో నిలబడి ఉన్నవాడు మన కబీరేకదూ!

తల్లి : అవునవును! స్వామీ చూసారా! కబీరు చుట్టూ జనం ఎలా మూగిపోయారో! నాకు తెల్సు. ఇంకాసేపట్లో చీరలన్నీ అమ్మేస్తాడు నా బంగారు కొండ.

రాము : జనం అలా విరగబడి మరీ చుట్టుముట్టింది, కబీరు చీరలు అమ్ముతున్నాడని కాదు.

తల్లి : మరీ!

రాము : అందరికీ పంచిపెడుతున్నాడని

తల్లి : పంచిపెడుతున్నాడా?

రాము : అవునమ్మా! నీతో అబద్ధం చెబుతానా? ఇదిగో కావాలంటే చూడు – అడిగిందే తడవుగా నాకూ ఓ చీరె ఇచ్చాడు దానంగా.

తల్లి : నాకొంప ముంచావు కదరా నాయనా! ఒరేయ్ కబీరూ. కబీరూ (బయటకు పరుగెత్తింది)

రాము : పిచ్చితల్లీ! తన దేహాన్ని దేవాలయంగా చేసుకుని, అంగాల్నే అర్చకులుగా మార్చుకొని, ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో రామనామ మంత్రోచ్ఛారణ చేస్తూ, జీవాత్మ పరమాత్మల మధ్య ద్వంద్వ రాహిత్యానికి ప్రయత్నిస్తూ ఆ సర్వేశ్వరునితో అనుసంధానానికై పరితపిస్తున్న కబీరుకి నీ కేకలు విన్పిస్తాయా? నీ మాటలు చెవికెక్కుతాయా?

(తల్లి కబీరు చెవి మెలిపెట్టి తీసుకొచ్చింది. కబీరు ఏదో పాట పాడుతూ తన్మయత్వంలో మునిగి తేలుతున్నాడు)

తల్లి : కబీరూ! ఏం పనిరా ఇది! నువ్వింక బాగుపడవురా! మనకి తినటానికి తిండి కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో దానాలు చెయ్యటానికి మనసెలా ఒప్పిందిరా! ఏదో వ్యాపారం చేసి ఈ కొంప నిలబెడతావని ఆశపడ్డాను.

రాముడు : ఆఁఆఁ నిలబడెతాడు, నిలబెడతాడు, ఉన్నకొంప ఎవరికైనా ఇచ్చేస్తాడేమో కనుక్కో.

తల్లి : అప్పుడు కనీసం నిలువ నీడలేకుండా అయిపోతాడు. అంతపని చెయ్యగల సమర్థుడే ఒరేయ్ బేటా! నీకోసం నువ్వు ఆలోచించరా! ఈ ఇంటినైనా వుంచుకుంటానని మాటివ్వరా!

కబీరు : (ఇంకా ధ్యానంలోనే వున్నాడు).

తల్లి : నేనింత మొత్తుకుంటుంటే ఉలుకూ, పలుకూ లేకుండా రామా రామా అని పిచ్చి కూతలు ఏంట్రా?

రాము : దండం దశగుణంభవేత్ అన్నారు – గట్టిగా నాలుగు తగిలించు అమ్మా (చేతి కర్రను అందించాడు)

తల్లి : మీరే చూస్తారుగా ఎలా తగిలిస్తానో! ఇదిగో ఇది వృత్తిపని నేర్చుకోనందుకు ఈదెబ్బ (కొట్టింది)

రాము : అమ్మా!

తల్లి : (పట్టించుకోకుండా) ఇదిగో ఇది రామా! రామా! అంటున్నందుకు ఈ దెబ్బలు (రెండుసార్లు కొట్టింది)

రాము : అమ్మాఁ అమ్మా!

| | | |
|---|---|---|
| తల్లి | : | ఇది... ఇది... ఇది నాలాంటి దౌర్భాగ్యురాలికి కొడుకువైనందుకు (ఇష్టమొచ్చినట్టు కొట్టింది) |
| రాము | : | అమ్మా! అమ్మా! అమ్మా! అమ్మా. (ఆమె కొట్టినంతసేపు గిలగిల్లాడాడు. దాంతో పైన కప్పుకున్న శాలువా జారి కిందపడింది) |
| తల్లి | : | (ఏం జరిగిందో అర్థం చేసుకుని) స్వామీ! స్వామీ! ఏమిటి స్వామీ (కబీరుని, రాముడిని మార్చి మార్చి చూసింది) |
| రాము | : | (చిర్నవ్వు నవ్వుతాడు) భక్తుని కష్టాలు భగవంతునివే కదమ్మా. |
| తల్లి | : | అంటే! అంటే... స్వామి... మీరు.. మీరు..... |
| రాముడు | : | అవును. నేను కబీరు నిత్యం స్మరించే రాముణ్ణి. |
| తల్లి | : | (ఉద్వేగభరితురాలై) యా అల్లా! రామా! నన్ను క్షమించు తండ్రీ |
| రాముడు | : | కబీరు కారణ జన్ముడు. నా భక్తుడు. అనుక్షణం అతడిని అనుసరించి వుంటాను. |
| తల్లి | : | నా జన్మ ధన్యమైంది స్వామి. నా బిడ్డ పుణ్యాన నిన్ను కళ్ళారా చూసే భాగ్యం లభించింది. |
| రాము | : | కబీరు చరిత్రను సృష్టిస్తాడు. చరిత్రలో ఆ చంద్రతారార్కం చిరస్థాయిగా నిలబడతాడు (అంతర్ధానమయ్యాడు) |
| తల్లి | : | (స్పృహలోకి వచ్చింది) కబీరూ! నాయనా కబీరూ! |
| కబీరు | : | ఏమైందమ్మా! ఎందుకలా ఏడుస్తున్నావు? |
| తల్లి | : | నిన్ను పెంచిన నా జన్మ ధన్యమైంది బేటా? నాకు నీ రాముడు కనిపించాడయ్యా! రాముడు కనిపించాడు. |
| కబీరు | : | ఏంటమ్మా! ఏంటమ్మా నువ్వనేది... నా రాముడు... నా దైవం... నీకు కన్పించాడా? |
| తల్లి | : | (ఔనని తలూపింది) |
| కబీరు | : | ఎంత అదృష్టవంతురాలివమ్మా! తల్లిదండ్రులు చేసుకున్న పుణ్యఫలం పిల్లలకు దక్కుతుందంటారు. నీ బిడ్డ నైనందుకు నా జన్మ ధన్యమైందమ్మా. |
| తల్లి | : | లేదు బేటా! నిన్ను పెంచిన పుణ్యమే నాకు రాముని రూపంలో కనిపించిందయ్యా (రామానందుల వారు వచ్చారు) |
| కబీరు | : | గురుదేవా! విన్నారా! నా తల్లికి రామదర్శనం లభించింది. |
| రామా | : | ఆహా! ఎంత అదృష్టవంతుడివయ్యా కబీరూ! రాముడైనా, దేవుడైనా నీ అచంచలభక్తి భావనకు కరగకుండా వుండగలడా? కదలిరాకుండా |

నిలవగలడా? నిన్ను శిష్యుడిగా పొంది నేనెంత అదృష్టవంతుడ్ని అయ్యాను.

**కబీరు** : అంతా తమ ఆశీర్వాదమే కదా గురువర్యా.

**రామా** : నాయనా! ఇంతటి భక్తిపరుడవయిన నీవు ధర్మ నిర్వహణ బద్ధుడవయ్యావనుకో లోకానికెంత మేలో కదా!

**కబీరు** : నాకర్థం కాలేదు గురుదేవా!

**రామా** : భోగి కాలేనివాడు యోగి కాలేడు. ఇహంలేనిదే పరం రాదు. గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణకు నీవు వివాహం చేసుకోవాలి.

**కబీరు** : గురుదేవా! నాకు వివాహమా?

**రామా** : తప్పుకాదు నాయనా! నీ భక్తిభావనా తరంగాలు మున్ముందుకు కొనసాగటానికి, నీ ఆధ్యాత్మిక అవగాహన రాబోయే తరాలకు అందించటానికి, నీవు వివాహం చేసుకుని సంతానాన్ని పొందాలి.

**కబీరు** : ఏమిటీ నాకు సంతానమా?

**రామా** : సంతానం కేవలం కామేచ్ఛకు గురుతుకాదు. సంతానం మానవ జీవనపరంపరకు సంకేతం. కాదనకు.

**కబీరు** : రాముడే మీచేత ఈమాట పలికిస్తున్నాడు. అలాగే కానివ్వండి.

**తల్లి** : (ఆనందపడిపోయి) నాతండ్రే! నా తండ్రే!

లైట్సాఫ్

# నాల్గవ రంగం

వ్యాఖ్యాత : రామానందులవారి ప్రోద్బలంతో, తల్లికోరిక ప్రకారం కబీర్‌దాసు వివాహం చేసుకున్నాడు. అతని భార్య పేరు లోయీ. ఆమె చాలా అందగత్తె. ఆ దంపతులకిప్పుడు ఓ కొడుకు కూడా పుట్టాడు. అతని పేరు కమాల్. కబీర్‌కి కొడుకు పుట్టిన కొన్నాళ్ళకు తల్లి పరమపదించింది. లోయీ కబీర్‌దాస్‌కు అన్ని విధాలా అనుకూలవతియైన ధర్మపత్ని. వారి సంసారం ఒకవైపున పేదరికం, ఉపవాసాలతోపాటు మూడు భజనలు ఆరు సత్సంగాలుగా కొనసాగుతోంది.

లైట్సాన్

(కబీర్‌దాస్ ఎదురుగా కొడుకు కమాల్ మరికొంత మంది భక్తులు కూర్చుని వున్నారు)

కమాల్ : ఆత్మ – పరమాత్మల సంబంధమేమిటి బాబా! చావు పుట్టుకల గురించి మీరేమంటారు?

కబీరు : బేటా! కుండలో నీరుంటుంది. కుండ పగిలిపోతే నీరు మట్టిలో కల్సిపోతుంది. ఇంతవరకు నీటిని దాచిన కుండ కూడ మట్టే. నీరు మితమైన మట్టినుండి అపరిమితమైన మట్టిలోకి జారిపోయింది. ఇలా జారిపోయేది కేవలం జలం మాత్రమే కాదు. జీవజలం కూడా!

(అంతలో ఓ ధనవంతుడు ఆగ్రహావేశాలతో వూగిపోతూ అక్కడకు వచ్చాడు. అతడి పేరు కరీముల్లా. అతని వెనుక నౌకరున్నాడు.)

కరీ : కబీరూ! ఓయ్ కబీరూ!

కబీ : ఏం నాయనా! ఎందుకలా అరుస్తున్నావు?

కరీ : ఒళ్ళుమండి.

కబీ : ఎందుకు?

కరీ : ఎందుకా? నీ వెధవబోధనలు, నీ పిచ్చి కూతలు విని మా తమ్ముడు వ్యాపారం మానేసాడు – ఉన్న ఆస్తిపాస్తులన్ని పేదలకు పంచేస్తున్నాడు. నీలాంటి విషపురుగు మనుష్యుల మధ్య ఉండకూడదు.

నౌకరు : ఊళ్లో ఇలాంటి గొప్పోళ్ళున్నందుకే వర్షాలు పడి పంటలు పండుతున్నాయి బాబు!

కరీ : నువు నోర్మయ్! ఏం ఊరొదలిపోతావా? ఇంట్లోంచి తరిమేయాలా!

| | | |
|---|---|---|
| కబీరు | : | అహంకరించకు కరీముల్లా! |
| కరీ | : | కరీముల్లా! అంటే నా పేరు కూడా తెలుసుకున్నావన్నమాట. నేనెవరో తెల్సుకుని, నా పేరు కూడా తెలుసుకుని నన్ను చూసి గజగజ వణకాల్సిన వాడివి, నా కళ్ళల్లో కళ్ళు పెట్టి నా పేరు పెట్టి పిలుస్తావా పకీరు వెధవా! |
| కబీరు | : | మట్టిని తొక్కుతూ, మట్టీ మట్టీ నా కాళ్ళ క్రింద పెట్టి నిన్నెలా తొక్కుతున్నావో చూసావా అన్నాట్ట కుమ్మరి. అందుకు మట్టి అందట - మనిషీ! మనిషీ! నిన్ను మట్టిలోపెట్టి త్రొక్కే రోజు తొందర్లోనే వుంది. అహంకరించకు' అని, అహంకరిచటం మానేసి చెప్పునాయనా నీకేంకావాలో? |
| కరీ | : | నువ్వు ఈ ఊరొదిలి వెళ్లిపోవాలి... ఊరిలో నీలాంటి సన్నాసులుంటే మనుషులెవరూ సంసారాలు చెయ్యలేరు. సంపాదన సాగించలేరు. |
| కబీరు | : | మీరు సంపాదించేదంతా ఎవరికోసం? సమాజానికా? సంసారానికా? |
| కరీ | : | ఏమిటి పిచ్చి ప్రశ్న!... నాకోసమే. |
| నౌక | : | మీకోసమా? మీ జానెడు పొట్టకోసం ఇంత సంపాదించాలా? |
| కబీరు | : | చూడు నాయనా! మనిషి సంపాదించింది ప్రతీదీ అశాశ్వతమే. ఎందుకంటే అతనే శాశ్వతం కాదు కాబట్టి. మృత్యువు ముంగిట మీరు నిలచినవేళ మీ ఇంట ఉన్నదంతా ఏమౌతుంది? |
| కరీ | : | ఏమౌతుంది? నా తర్వాత నావాళ్ళు, అంటే నా భార్యా బిడ్డలు దాన్ని హాయిగా అనుభవిస్తారు. |
| కబీరు | : | అంటే మీ సంపాదనంతా మీ భార్యా బిడ్డల కోసమే అన్నమాట. |
| కరీ | : | ఇంతకన్న పిచ్చి ప్రశ్న మరొకటి ఉండదు. ఈ ప్రపంచంలో ప్రతి మనిషి చేసే పని అదే. ఒక్క నువ్వు తప్ప. |
| కబీరు | : | అయితే తమరు పోయేటప్పుడు ఒక్క పైసా కూడా వెంట తీసుకువెళ్లలేరన్న మాటేగా! |
| నౌక | : | వల్లకావాలేగానీ వల్లకాట్లోకి కూడా తీసుకెళ్తానంటారండీ! |
| కరీ | : | నేనేమిటి? ఎవరూ తీసుకెళ్ళలేరు. |
| కబీ | : | అయితే మీ భార్యాబిడ్డలకోసం ఇంత శ్రమించి కూడబెడుతున్నారుగద. రేపు మీకేదైనా ఆపద వస్తే వారు మీకు అండగా నిలబడతారా? |

కరీ : చూడు కబీర్! సంసారబంధాల గురించి ఏమాత్రం అవగాహనలేకుండా మాట్లాడుతున్నావు. కుటుంబంలో ఎవరికేది వచ్చినా అందరూ సమానంగా భరిస్తారు. తోడునిలుస్తారు.

కబీరు : మిగిలినవారి గురించి మనకెందుకయ్యా, నేనడిగేది నీ గురించి, మీ వాళ్ళు నీకు అండగా నిలుస్తారా?

కరీ : ఆహాఁ అందులో సందేహందేనికీ... నాకోసం మావాళ్లు ప్రాణాలైనా ఇస్తారు.

కబీరు : అయితే నేనొక పరీక్ష పెడతాను.

కరీ : ఏమిటీ? నువ్వు నాకు పరీక్ష పెడతావా? బాగుంది. బాగుంది. పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టుకోమన్నాట్ట. నీలాంటివాడే ఒకడు.

కబీరు : పిచ్చి నాకు కాదు నాయనా! సంసారం, సంపాదన అనే పిచ్చి నీది. వాదనెందుకు? నేను పెట్టే పరీక్షలో నీవు ఓడిపోతే నామాట వింటావా?

కరీ : నువ్వోడిపోతే ఈ ఊరొదిలి వెళ్ళిపోతావా?

కబీరు : ఆహా! నువ్వు గెలిస్తే నీవు కోరినట్లు నేను ఈ ఊరొదిలి వెళ్లిపోతాను.

కరీ : నేనోడిపోతే నీకు శిష్యుడిగా మారి నీకు సేవచేస్తాను. (కబీరు కరీముల్లా చెవిలో ఏదో చెబుతుండగా)

-లైట్సాఫ్-

లైట్సాఫ్ : (కబీరు ఇంటిముందు అరుగుమీద దొర్లిదొర్లి ఏడుస్తున్నాడు కరీముల్లా)

కరీ : అబ్బా! అమ్మా! నొప్పి. ఈ బాధ భరించలేకపోతున్నాను. కబీర్‌దాస్! ఏదో ఒక మందిచ్చి పుణ్యం కట్టుకోవూ?

(బయటినుండి కరీముల్లా భార్య, ఇద్దరు కొడుకుల్ని తీసుకొచ్చాడు నౌకరు. వాళ్ళను చూసి కరీముల్లా ఇంకా ఏడ్చాడు)

భార్య : ఏవండీ! ఏమైందండీ! ఇంట్లో బయలుదేరినప్పుడు బాగానే ఉన్నారు కదండీ. ఇంతలో ఏం ముంచుకొచ్చిందండీ.

నౌక : కబీర్‌గారిని ఊరొదిలి పొమ్మన్నారండీ. తనే ఈ లోకం వదిలి పోయేట్టున్నారండీ.

కరీ : భరించలేను.... ఈ బాధ భరించలేను. కబీర్ దాస్! ఏదైనా మందుంటే ఇవ్వవూ.

భార్య : ఆయన అన్నమాటలు పట్టించుకోకుండా... మంచి మందిచ్చి పుణ్యంకట్టుకోవూ.

కబీరు : అందరూ కాస్త దూరంగా జరగండి... (నాడి పరీక్షించి నిరాశగా ముఖం పెట్టాడు)

చిన్న కొడుకు: ఏవిటండీ అలా ఉన్నారు! పరిస్థితి ప్రమాదం కాదుకదా!

కబీరు : ఇదేదో వైద్యశాస్త్రానికే అంతుపట్టని రోగంలా వుంది. ఏదైనా చెప్పటం కష్టమే (భార్య గొల్లుమంది)

పెద్ద కొడుకు : అమ్మా! ఊరుకో... నాన్నగారికేం కాదు.. అయ్యా కబీర్‌దాసుగారు! ఎలాగయినా మా నాన్నగారిని కాపాడండి. ఎంత ఖర్చయినా బాధలేదు. ఎన్ని బంగారు నాణాలయినా ఇస్తాను.

నౌక : నాణాలు ప్రాణాలు నిలుపుతాయండీ....

చిన్న కొడుకు: నువు నోరుముయ్యరా! ఏమయింది కబీర్‌గారు!

కబీ : రోగం పరిస్థితి నాకూ అంతుబట్టటం లేదు. చూస్తూ వుంటే ఇప్పుడో ఇంకాసేపటిలోనో అనేట్లుంది పరిస్థితి.

భార్య : నన్ను అన్యాయం చేసి వెళ్లకండి... మీరు లేకుండా నేను బ్రతకలేనండీ. (కొడుకులిద్దరూ ఓ పక్కకు వెళ్ళారు)

పెద్ద కొడుకు : తమ్ముడూ నాన్నగారి పరిస్థితి లాభంలేదని కబీర్ చెబుతున్నారు. ఇప్పుడేం చేద్దాం.

చిన్న కొడుకు: ఏం చేయటానికి మనమేమైనా దేవుళ్ళమా?... ముందు జరగాల్సింది చూడు.

పెద్ద కొడుకు : జరగాల్సిందేముంటుందీ... ఇంకా ప్రాణాలు పోలేదుగా –

చిన్న కొడుకు: ఆస్థి పంపకాల గురించి మాట్లాడుతున్నాను నేను.

పెద్ద కొడుకు : పంపకాలా?... అదేంమాట తమ్ముడూ.. ఇప్పుడు దాని అవసరమేమొచ్చింది... అయినా ఇప్పుడు ఆస్తి పంచుకుని విడిపోతే ఆయన ఆత్మ శాంతించదు.

చిన్న కొడుకు: అలాగని!... ఏం చేద్దామంటావు?

పెద్ద కొడుకు : పెద్ద కొడుకు ఇంటి బాధ్యత వహించాలంటారు. చిన్నవాడివి. ఇంత పెద్ద ఆస్థిని కాపాడే శక్తి నీకు లేదని తెల్సు – అందుకే కష్టమో, నిష్టూరమో ఆ బాధ్యత నేనే తీసుకుంటాను.

చిన్న కొడుకు: ఆహా! అప్పనంగా మొత్తం కొటేద్దామని ప్రయత్నమా?.. అదేం కుదరదు. నాన్నగారికి నీకన్నా నేనంటేనే ఎక్కువ ప్రేమ.. అందుకే ఆ బాధ్యత నేను తీసుకుంటాను.

పెద్ద కొడుకు : పెద్దకొడుకు నేనుండగా అదెలా కుదురుతుంది?

చిన్న కొడుకు: ఎందుకు కుదరదు? కావాలంటే నాన్నగారి నోటినుండే చెప్పిస్తాను. విను. (ఇద్దరూ తండ్రి మంచం దగ్గరకు వెళ్ళారు)

పెద్ద కొడుకు : నాన్నా! మీ తర్వాత ఇంటి బాధ్యత నాదే కదూ!

చిన్న కొడుకు: నాన్నా! నీకు నీనంటేనే ప్రేమ కదూ!

భార్య : నోళ్ళు మూయండ్రా! ఆయనకు బతికుండగానే తలకొరివి పెట్టేలా వుంది మీ వరుస చూస్తుంటే... అయినా ఆయన జీవితంలో సగభాగాన్ని, అర్ధాంగిని, నేనుండగా ఆస్థి మీదెలా అవుతుంది? నా తరువాతే మీది.

పెద్ద కొడుకు : అంటే ఇన్నాళ్ళూ. ఆయనగారి పెత్తనంలో బతికాం. ఇక నీ పెత్తనం మొదలా!

చిన్న కొడుకు: మాకూ వయసు వచ్చింది. మా బాధ్యతలు మాకు తెలుసు. నువ్వేం పెత్తనం చెయ్యాల్సిన అవసరం లేదు.

భార్య : (కరీముల్లాతో) ఏమండీ! వింటున్నారా?.. వింటున్నారా?... వీళ్లమాటలు... మీరు బ్రతికుండగానే నన్ను గడ్డిపోచ క్రింద జమకడుతున్నారు. మీ తరువాత నన్ను బాగా చూసుకుంటారని నమ్మకం ఏమిటి? అందుకే ఆస్థి నాపేరున వ్రాయండి. కనీసం ఆ భయంతోనైనా నన్ను సరిగ్గా చూసుకుంటారు.

పెద్ద కొడుకు : కుదరదు నా పేరున రాయాల్సిందే.

చిన్న కొడుకు: కానేకాదు, నా పేరు మీద రాయండి నాన్నగారూ!

భార్య : నేను మీ భార్యనండీ. కష్టంలో సుఖంలో మీతోకలిసి బతికినదాన్ని. నా తరువాతే వీళ్ళు.. నా పేరునే రాయండి. (ముగ్గురూ నాకంటె నాకని గొడవపడుతుంటారు. కరీముల్లా అచేతనంగా చూస్తున్నాడు)

నౌక : ఆపండి బాబూ.... ఆపండి (ఆగారు) జబ్బు రోదనలు పోయి డబ్బు వేదనలు మొదలయ్యాయి. బాబూ! అయ్యగారింకా పోలేదు. ఆయన కళ్ళముందే ఇలా ఆస్తులకోసం పోట్లాడుకుంటూ వుంటే ఆయన మనసెంత బాధపడుతుందో ఆలోచించండి.

చిన్న కొడుకు: నౌకరు వెధవ్వి, నువ్వు మాకు చెప్పేదేంట్రా?.. అయినా ఆయన బతికున్నప్పుడేగా ఈ విషయం తెల్చుకోవాల్సింది. ఆయన పోయాక మా గొడవెలా తీరుతుంది.

నౌకరు : బాబూ... ఆఖరి దశలో వున్న వారిని కాపాడుకోవాలిగానీ వారి చావును సొమ్ము చేసుకోవాలనుకోకూడదు.

పెద్ద కొడుకు : ఆయన బ్రతకడని కబీర్‌దాస్‌గారు చెప్పారుగా. ఇంక ఏంచేసి ఏం ప్రయోజనం.

నౌక : మీకు మీరే ప్రయోజనం లేదనుకుంటే ఎలాగండీ? కబీర్‌దాసుగార్ని గట్టిగా అడిగి చూడండి. ఏమంత్రమేస్తారో, ఏ మూలికావైద్యం చేస్తారో....

భార్య : అలాగే! అలాగే! కబీర్‌దాసుగారూ! మీ కాళ్ళమీద పడి వేడుకుంటున్నాను. ఏదో ఒకటి చేసి నా భర్తను బ్రతికించరూ!

కబీ : లోయీ! ఓ లోటాతో పాలు తీసుకురా!

నౌక : ఏవిటండీ! తులసితీర్థం పాలతోకూడ పోస్తారండీ!

పెద్ద కొడుకు : ఒరే! నువ్వుండగా ప్రాణాలు తీయడానికి ఖుదా రానక్కర్లేదురా! (లోయీ లోటాతో పాలు తీసుకొచ్చింది. కబీరు ఆ పాలలో ఏదో భస్మం కలిపాడు)

కబీ : చూడండి నాయనలారా! ఇది మీ నాన్నగారిని బ్రతికించే దివ్య ఔషధం.

చిన్న కొడుకు: అయితే త్వరగా ఇవ్వండి స్వామీ!

భార్య : తొందరగా ఇవ్వండి బాబు!

కబీ : ఇవ్వవలసింది ఆయనకు కాదు. మీలో ఒకరికి.

చిన్న కొడుకు: (ఆశ్చర్యంగా).... ఆఁ....

కబీ : మీ నాన్నగారి ప్రాణాలు కాపాడుకోవాలంటే మీలో ఒకరు దీన్ని సేవించాలి.

ముగ్గురు : నాకివ్వండి... నాకివ్వండి (ఎగబడ్డారు)

కబీ : ఆగండి. విషయం పూర్తిగా తెల్సుకోండి. మీలో ఆయన్ని అమితంగా ప్రేమించేవారు మాత్రమే ఈ పాలు త్రాగటానికి అర్హులు. వారు ముందుకు రండి.

భార్య : ఆయన్ని నేను ప్రేమించినంతగా ఎవరూ ప్రేమించలేరు. నాకివ్వండి స్వామీ!

| | | |
|---|---|---|
| **పెద్ద కొడుకు** | **:** | మా నాన్నగారంటే నాకు వల్లమాలిన అభిమానం. నాకివ్వండి స్వామీ! |
| **చిన్న కొడుకు** | **:** | ఆయన కోసం ఏం చెయ్యమన్నా చేస్తాను. ఆ పాలు నాకివ్వండి |
| **కబీ** | **:** | చాలా సంతోషం. మీ పితృభక్తికి, భర్తపట్ల ఉన్న ప్రేమకు ఎంతో ఆనందంగా వుంది. కానీ ఈ పాలు తాగిన వారు క్షణంలో మరణిస్తారు. (ముగ్గురూ కొయ్యబారిపోయారు)<br>ఆ మరణించిన వారి ఆయుర్ధాయంతో వీరు బతుకుతారు – ఇప్పుడు చెప్పండి. మీలో ఎవరు తాగుతారీపాలు – ఏమ్మా తాగుతావా? |
| **భార్య** | **:** | ఆయనంటే నాకెంతో ప్రేమ – కాదనను – కానీ – నేను పోతే పిల్లలు తల్లిలేని వాళ్ళవుతారు. ఏనుగంత తండ్రికన్న, ఏకుల బుట్టంత తల్లిమేలు అని పెద్దలంటారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా నేనీపాలు స్వీకరించలేను స్వామీ! |
| **పెద్ద కొడుకు** | **:** | స్వామీ!... నాకు పెళ్ళయింది. నా భార్యకు నేనంటే ఎంతో ప్రేమ. నేను మరణిస్తే తను బతకలేదు. తన ప్రాణాలు పోవడం నాకిష్టం లేదు. అందుకే నేనూ స్వీకరించలేను. |
| **చిన్న కొడుకు** | **:** | నాన్నగారికోసం ఆ పాలు నేను తాగుతాను. కానీ... ఆయనకు నేనంటే ప్రాణం.. నేను చనిపోతే ఆయన భరించలేడు. ఆ బాధతో ఆయన కన్ను మూస్తాడు. ఎలాగూ బతకని ఆయన కోసం నా ప్రాణాలు తీసుకోవటంలో అర్థం లేదు. అందుకే నాకూ వద్దు. |
| **కబీ** | **:** | మీలో ఎవరూ దీన్ని తాగకపోతే ఆయన బ్రతకరు! |
| **పెద్ద కొడుకు** | **:** | ఓ పనిచేయండి స్వామీ! (నౌకరును ముందుకు నెట్టి) వీడికి మా నాన్నగారంటే ఎంతో ప్రేమాభిమానాలున్నాయి – వీడికివ్వండి ఆపాలు |
| **నౌక** | **:** | ఇవ్వండి బాబూ! నాకివ్వండి! మనస్ఫూర్తిగా తాగుతాను. సంపదలకోసం ఎన్ని పాపాలు చేసినా నన్నెంత ప్రేమగా చూసేవాడు. నా కూలీకన్నా ఒక్క అణా నాకేనాడూ ఇవ్వకపోయినా, తను తినే రకరకాల పిండివంటల్లో ఒక్కటీ నాకేనాడు ఇది తినరా అని ఇవ్వకపోయినా, తను కడుపెక్క తినేసి, బ్రేవ్‌మని తేన్చేసి, ఏరా నువ్వు తిన్నావురా అని అడుగుతాడండీ! ఎనకాముందూ ఎవరూ లేని నాకు ఆ ఒక్కమాట కొండంత ధైర్యాన్నిచ్చేదండీ! ఆ మాట విన్న ప్రతీసారీ గుండె నాలుగంగుళాలు పొంగేదండీ. ఆ మాటకోసం తాగుతాను. ఆ ప్రేమకోసం తాగుతాను. ఇవ్వండి బాబూ! ఆ లోటా నాకివ్వండి బాబూ! |
| **కబీ** | **:** | అలా కాదు నాయనా! రక్తసంబంధీకులే సేవించాలి. అది రామాజ్ఞ. |

**చిన్న కొడుకు :** గాడిదగుడ్డేం కాదూ. ఈయన కోసం మా ప్రాణాలు తీసుకోవాలా? భలే చెప్పార్లే. అయినా ఇప్పుడాయన బతికిమాత్రం ఏం చేస్తారు. అనుభవించాల్సినందంతా అనుభవించాడు.

**పెద్ద కొడుకు :** మాకింకా జీవితం ముందుంది. ఈయన కోసం చావాల్సిన అవసరం లేదు. ఆయన బ్రతుకు మా చావుకు వస్తుందంటే ఎలా?

**కబీ :** (భార్యతో) ఏమ్మా మరి మీరేం అంటారు?

**భార్య :** ఆయనంటే ప్రేమలేదని చెప్పను. కానీ ఆయన కోసం చచ్చేంత ప్రేమ మాత్రం లేదు.

**కబీ :** (కరీముల్లా వైపు తిరిగి) ఇప్పటికి సత్యం అర్థమైందా?

(అతడు టక్కున లేచి కన్నీళ్ళతో కబీరు పాదాలపై బడ్డాడు)

**కరీ :** స్వామీ! నన్ను క్షమించండి. నా కళ్లు తెరుచుకున్నాయి. తుచ్ఛమైన సంసార జంఝాటంలో పడికొట్టుకుంటున్న నాకు వాస్తవం తెలిసి వచ్చింది. ఇక నాకీ జీవితంపై విరక్తి కలిగింది. వీళ్ళకు కావాల్సిన ఆస్థిని వీళ్ళకే వదిలేస్తున్నాను. నేను మీతో వచ్చేస్తాను. నన్ను మీ శిష్యుడిగా స్వీకరించి ఉపదేశం చెయ్యండి స్వామీ.

**కబీ :** బంధాలు, అనుబంధాలు మానవ నిర్మితాలు. భవబంధాల కతీతమైన రామనామధ్యానం చెయ్యి. నీకు మనశ్శాంతి కలుగుతుంది.

ఏక్‌దిన్‌ఐసాహోయెగా
కోవూ కా హూ కాకహీ
ఘర్‌కీ నారీనాహి
తన్‌కా నరీ కహీ

**కరీ :** ఆహా ఎంతబాగా చెప్పారు. ఒకరోజు ఎవరు ఎవరికీ ఉండరు. ఇంట్లో నీ భార్యతోపాటు, ఒంట్లో నీ నరం కూడా నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతుంది, తెలుసుకో, ఏదీ శాశ్వతం కాదు.

(దోహాగానం కబీరు నిష్క్రమిస్తాడు. అతన్ని అనుసరిస్తూ కరీముల్లా కూడా వెళ్ళిపోయాడు)

లైట్సాఫ్

# ఐదవ రంగం

(ఓ రచ్చబండమీద కబీర్‌దాస్, అతని చుట్టూ కొంతమంది కూర్చొని ఉన్నారు)

**కమాల్** : బాబా! దుఃఖానికి కారణమేమిటో?

**కబీ** : ఆనందమెక్కడుందో తెలుసుకోకపోవటమే.

**కమాల్** : మరి ఆనందం ఎక్కడుంది?

**కబీ** : దైవమెక్కడుందో ఆనందం అక్కడే వుంటుంది. ఈ ప్రజ్ఞ లేకనే ప్రపంచం ఓ కన్నీటి లోయలాగ, శోకాల జలపాతంలాగా మారిపోతుంది.

**హిందు** : నేను ఎన్నాళ్ళనుండో గుడికి వెళ్తున్నాను. అందులోని దేవుడ్ని ఎంతో భక్తితో ప్రార్థిస్తున్నాను. కానీ నాకు దేవుడు కనిపించటం లేదేమి గురుదేవా?

**కబీ** : రాతిని పూజించినంత మాత్రాన దేవుడు కనిపిస్తే నేనొక కొండనే పూజచేసేవాడిని. దేవతల రూపాల్లో వున్న ఆరాతి బొమ్మల కన్నా మన విసురు రాళ్ళు ఉపయోగకరమైనవి. వాటివల్ల మానవునికింత ఆహారమైనా లభిస్తుంది.

**కబీ** : కస్తూరి కుండలబసే మృగడూంఢే బనమాహి
ఐసే ఘటనే ౼ పీవేహై దునియాఁ జానే నాహి

**లోయీ** : కస్తూరి తన నాభియందున్నదనే ఆలోచన లేక కస్తూరి మృగము అరణ్యమంతా అన్వేషించుచున్నట్లు, భగవంతుడు హృదయము నందున్నాడనే జ్ఞానము నశించి మానవులు బాహ్య ప్రపంచంలో భగవంతుని కొరకు అన్వేషిస్తున్నారు.

**ముస్లిం** : అచ్ఛాబోలా! అచ్ఛాబోలా! అచ్ఛా సునో – బాబా చెప్పింది విని సిగ్గుపడాల. పూజలు చేస్తారట పూజలు. పూజలు బంద్ చేసి నమాజులు చెయ్యండి 'అల్లాహో అక్బర్' అని పిలిచేటప్పుడు మీరు కూడా మాతో మసీదులకు రండి.

**కబీ** : ఎందుకలా పిలుస్తారు? అల్లా ఏమైనా చెవిటివాడా? అంత గట్టిగా పిలిస్తే తప్ప అల్లాకు వినబడదా?

**హిందు** : భలే అడిగారు, అల్లా చెవిటివాడా? చెప్పండి సమాధానం.

**ముస్లిం** : మేమలా పిలిస్తే అల్లా వస్తాడు. మీ దేవుళ్ళురారే. రాతి బొమ్మలు కదా!

**హిందు** : మాకు కనీసం చెప్పుకోవటానికి ఓ బొమ్మైనా వుంది, మీకదీలేదుగా! చెప్పండిరా! మీదేవుడెలా వుంటాడో ఇప్పటికీ తెలియదు.

**ముస్లిం** : ఓరి మూర్ఖుల్లారా! మేము వెధవలంకాదు. కుక్కల్ని, కోతుల్ని, చెట్లను, చేమల్ని దేవుళ్ళనుకోవటానికి!

**హిందు** : అవును మాది విశాలమైన వసుధైక దృష్టి. మా దృష్టిలో సకల ప్రాణులు దైవ స్వరూపాలే!

**ముస్లిం** : చేసేవన్నీ పాపాలే.

**హిందు** : పాపాలు చేసేది మేముకాదుమీరే! ఛీఛీ! సరిగ్గా స్నానాలు చేసి కూడా తగలడరు, శుచీ, శుభ్రం, ధ్యానం, జ్ఞానం ఏవీ ఉండవు. చూడండీ! ద్విజత్వం పొందినందుకు చిహ్నంగా ఈ యజ్ఞోపవీతాన్ని చూడండి. అరిషడ్వర్గాల్ని జయించి, దేవుడ్ని ఈ గుండెగుడిలో ప్రతిష్టించుకున్నామని తెలియజేస్తూ శరీరం యావత్తూ ధరించిన దీపశిఖల్లాంటి ఈ నామాల్ని చూడండి. మేము అతి పవిత్రంగా దైవ ప్రీత్యర్థం చేసే యజ్ఞ యాగాది క్రతువుల్ని చూస్తూ కూడా మమ్మల్ని అనడానికి మీకు నోరెలా వస్తుందిరా అప్రాచ్యుడా!

**కబీ** : అయ్యా మట్టితో నిర్మితమైన ఈ శరీరంపై మళ్ళీ ఈ బూడిదలు పులమటం ఎందుకు? జందెం వేసుకున్నంత మాత్రాన ఒక మనిషి ద్విజుడైపోతాడా? దానివల్లే పవిత్రత వస్తే ఎప్పుడూ తాడు వేసివుండే గిలక బావి కూడా బ్రాహ్మణుడు కావాలి కదా – హోమాలవల్ల మీరెంత పవిత్రులయ్యారో నాకు తెలీదుగానీ, దాని నుండి వచ్చే పొగవల్ల మీకళ్ళు మందగించి సత్యం కనిపించకుండా పోయింది.

**ముస్లిం** : బాగా చెప్పావు బాబా! జపాల పేరున జీవితాంతం పూసలు లెక్కబెట్టేకంటే రోజు కయిదుసార్లు నమాజు చెయ్యటం మంచిది కదా బాబా! వ్రతాలు, పూజలని కడుపునిండా మెక్కే బదులు ఒంటిపొద్దులతో రోజాలు చెయ్యడం మంచిది కదా బాబా!

**కబీ** : తప్పునాయనా! వాళ్ళ సాంప్రదాయాలేకాదు, మీ విధానాలు కూడా లోపభూయిష్ఠమైనవే. మక్కాకి వెళ్ళేకన్న నీ ప్రక్కనే ఆకలితో ఉన్నవాడికి రోటీ పెట్టడం మంచిది కదూ. మసీదులో నమాజు పేరుతో పల్టీలు కొట్టేకన్న విశ్వమంతా వ్యాప్తి చెందిన ఈశునికి దాసునిగా మారటం మంచిది కదూ.

**ముస్లిం** : అసలు నీ ఉద్దేశమేమిటి. వాళ్లదీతప్పంటావు - మాదీ తప్పంటావు, నీకు నువ్వే దేవుడివనుకుంటున్నావా?

**హిందు** : నువ్వు చెప్పిందే వేదమా? నీకూతలన్నీ వేదవాక్కులుగా భావించి నీకు దాసోహమనాలా?

**కబీ** : మీరేమనుకున్నా నేను చెప్పేదొకటే. మీ విభేదాలు, వాటిపై చేస్తున్న వాదోపవాదాలు అవన్నీ మీ అహంకారాన్ని సూచించుకోటానికి, ఆధిపత్యాన్ని నిలుపుకోటానికే.

**హిందు** : సరే! మా ఆధిపత్యాలు, అహంకారాలు పక్కనబెట్టు - అసలు దేవుడంటే ఏమిటో చెప్పు-

**ముస్లిం** : సరిగ్గా చెప్పకపోయ్యావో! ఇప్పుడే ఇక్కడే ఖతం చేస్తాం.

**కబీ** : దైవం నిర్గుణుడు. నిరంజనుడు. అన్ని రూపాలు, నామాలు మనం కల్పించుకున్నవే. దైవతత్వం అంటే బ్రహ్మత్వమన్నమాట. అది ఇంద్రియాలకు గోచరించేది కాదు. అనుభూతితో మాత్రమే దర్శించగలం. దైవానికి నిలయం హృదయం. దాన్నెంత పవిత్రంగా వుంచుతావో భగవంతుడు కూడా అంత ఇష్టంతో అక్కడ నివసిస్తాడు. మనిషి నిర్మించుకున్న మట్టి, ఇటుకల మందిరాల కోసం ఒకరినొకరు చంపుకుంటున్నారు. నిజంగా దేవుడుండే ఆలయాన్ని కుల, మతాహం కారాలతో, మదమాత్సర్యాలతో నింపి పాడుచేస్తున్నారు. దేవుడ్ని దూరంగా తరిమేస్తున్నారు. ఆ తత్త్వాన్ని దర్శించటానికి ప్రేమ స్వభావం కావాలి - ఆ సర్వజనీనమైన ప్రేమను పొందటానికి నీ ప్రాణాలనైనా తేలిగ్గా త్యాగం చెయ్యి.

**హిందు** : మరి ఇది దైవం - ఇది బ్రహ్మ! ఇది నీ పిండాకూడు అని చెప్పి తగలడటానికి ప్రాతిపదిక ఏమిటో శలవియ్యి -

**కబీ** : ఆనందమే, దైవానికి, బ్రహ్మత్వానికి మూలసూత్రం - ప్రేమ దానికి ఆధారం. నీ హృదయమే మూలస్థానం - లోనవెలుగుతున్న ఆ జ్ఞాన దీపాన్ని దర్శించు - అజ్ఞానపు చీకటి పటాపంచలౌతుంది.

**ముస్లిం** : సరే. నువ్వు చెప్పిందే నిజమని నమ్మకమేమిటి?

**హిం** : నీ కన్న గొప్పవాళ్ళు చెప్పిందే కదా. మా శాస్త్రాలు, పురాణాలు అవీ నీవు తప్పంటే, నువ్వన్నది మాత్రం తప్పుకాదా?

కబీ : ఖురానైనా, పురాణమైనా కేవలం మాటల కులుకే – మాటలు చేసే గారడిలో కంటిముందున్నది నిజమో, అబద్ధమో నిర్ణయించలేం. సత్యాన్ని కేవలం మౌనంతోనే తెల్సుకోగలం. అందుకు నీ అనుభవమే నీకు తార్కాణం.

హిం/ముసి : అంటే ఇప్పుడు మేము ఆ మాయలో వున్నామా?

కబీ : అవును. నిజమైన భగవద్ధ్యానంలో బ్రతకండి. దేవుడు వేరు అనుకున్నంతకాలం వేరుగానే వుంటాడు. కానీ తెల్సుకోవాల్సింది ఒక్కటే. పంజరం అదే. పక్షి అదే, భావనా అదే, భావ్యం అదే, ఆత్మా అదే, పరమాత్మా అదే.

దోహా : ప్రియతమ్‌కో పతియాలిఖా
జోఁకహీ హొయబిదేశ్
తన్‌మే మన్‌మే నైనమే
తాకో కహా సందేశ్

ప్రియుడు దూరదేశంలో వున్నాడనుకుంటే లేఖ రాస్తాము. కాని అతడు మన కళ్ళల్లో, శరీరంలో, మనస్సులోనే వుంటే ఇక సందేశం ఎక్కడికో ఎందుకు పంపించాలి (పాడుకుంటూ వెళ్ళిపోయాడు)

హిందు : ఓరినీయమ్మ కడుపుమండా! అర్ధమౌతావు – అర్థం కావు. చిక్కినట్టుంటావు. జారిపోతుంటావు. ఆ పుస్తకాల్లోని నాలుగు ముక్కలు బట్టీబెట్టి పదిమందికి చెప్పుకుంటూ, నలుగురిలో ఇంత హోదాగా, తిండికి లోటేవీ లేకుండా బ్రతికేస్తావుంటే నీ గొడవతో ఛస్తున్నాం కదరా. ఏదో ఒకటి చేసి వీడ్ని ఊళ్లోంచి తరిమెయ్యకపోతే మన బతుకులు కష్టమైపోతాయి.

ముస్లిం : అరేభాయ్! ఈ పాగల్‌గానితో మాకూ బహుత్ కష్టంగా ఉంది. వీడ్ని ఊర్లోంచి బయటికి పంపాలి భాయ్!

హిందు : అరే! మీరు మాతో చేతులు కలిపితే ఒక్క క్షణంలో పంపించగలం

ముస్లిం : హు! బోలోభాయ్! ఏం చేస్తే వీడిపీడ విరగడౌతుందో బోలోభాయ్.

హిందు : చెబుతాను... చెబుతాను.. ముందు కబీరు దాసు బలహీనత లేమిటో తెలుసుకోవాలి.

ముస్లిం : సన్నాసికి బలహీనతలేమిటి భాయీ! అన్నీ బలాలే.

హిందు : ఆ! అదీ చూస్తా! ఆ వస్తున్నది తులసీరాం సేఠేకదూ.

**ముస్లిం** : కబీరును బద్నామ్ చేసే మార్గం చెప్పమంటే తులసీరాం సేఠ్‌ను చూపిస్తావేం?

**హిందు** : ఆ సేఠ్ ద్వారానే కబీర్‌ను బద్నాం చేసి ఊరునుండి వెళ్ళగొట్టాం.

**ముస్లిం** : ఎలా?

**హిందు** : తులసీరామ్‌ని గిల్లీ. అతను కబీర్‌కి సరుకునివ్వకుండా చేద్దాం.

**ముస్లిం** : తులసీరాం చాలా పద్దతైన మనిషే. మనమాటల్ని ఒప్పుకుంటాడంటావా?

**హిందు** : భాయ్! మనిషిని పద్ధతిలో పెట్టటం కష్టంకానీ, పక్కకు తప్పించటం ఎంతసేపు? పైగా తులసీరాం వ్యాపారస్థుడు. పిల్లికి బిచ్చం పెట్టనివాడు.

**ముస్లిం** : బిచ్చమేకాదు... ప్రాణం పోతుందన్నా ఎవరికీ అరువు కూడా ఇవ్వడు. ఇంకొకరిది కావాలని ఆశించడు.

**హిందు** : అతను ఆశించేటట్టు మనం చెయ్యాలి.

**ముస్లిం** : ఏమి ఆశించేటట్టు చెయ్యాలి.

**హిందు** : లోయీని!

**ముస్లిం** : ఓ!

**హిందూ** : అవును.. ఇలారా చెబుతాను (చెవిలో చెప్పారు). లోయీ తులశీరాంకి లొంగి పోయిందనుకోండి ఆ విషయమై ఊరంతా గోలగోల చేసి ఊర్లోంచి తరిమేద్దాం – ఒకవేళ లొంగలేదనుకోండి, తులసీరాం సరుకునివ్వడు కనుక తిండికిలేక అల్లాడిపోయి సంతర్పణలు మానేసి ఊరొదిలి పోతారు. ఎలా ఉంది నా ఆలోచన!

**ముస్లిం** : బహుత్ అచ్చా! ఆదా బర్సే తులసీరాంజీ

**తుల** : ఆదా బర్సే!

**హిందూ** : తులసీరాం... దుకాణానికి వెళ్తున్నారా?

**తులసీ** : అవునవును.

**హిందూ** : పదండి మాట్లాడుకుంటూ వెళ్దాం. ఈ ఊర్లో అందరికన్నా అందగత్తె ఎవరు అన్న దానిమీద

లైట్సాఫ్

# ఆరవ రంగం

(కబీరు అరుగుమీద కూర్చొని కీర్తనలు పాడుతున్నాడు.
లోయీ పూజకోసం పూలు కోసుకుని తెస్తున్నది)

**లోయీ** : చూడండి! దేవునికోసం పూలు కోసాను. ఎంత అందంగా వున్నాయో!

**కబీ** : ఈ పూలు చూస్తుంటే ఏమనిపిస్తుందో తెలుసా!

**లోయీ** : ఏమనిపిస్తోంది స్వామీ!

**కబీ** : మాలీ ఆవత్‌దేఖ్‌కే కలియాకరీపుకార్
పూలీచున్‌చున్‌లియే కాల్‌హమారీ బార్

**లోయీ** : ఆహాఁ ఎంతబాగా చెప్పారండీ. విరబూసిన పూలను కోస్తున్న తోటమాలిని చూసి, రేపు తమ వంతు వస్తుందని మొగ్గలు విలపిస్తున్నాయా?

నిజమే దేవునికి అర్పించాల్సింది హృదయ కుసుమమే కదండీ.

**కబీ** : అవును లోయీ! వృక్షంలో విత్తు వున్నట్టు, చెట్టులోనే నీడ ఉన్నట్టు, ఆకాశంలో శూన్యం ఉన్నట్టు బ్రహ్మం జీవునిలోనే ఉన్నాడు. జీవుడు కూడా బ్రహ్మంలోనే ఉంటాడు. ఇద్దరూ రెండుగా కనిపించినా ఎల్లప్పుడూ ఒక్కటిగానే ఉంటారు. అదే ద్వైతంలో అద్వైతం. భిన్నత్వంలో ఏకత్వం.

(బయటి నుండి కబీర్‌దాస్! కబీర్ దాస్ అనే కేకలు విన్పించాయి)

**కబీ** : ఉండు! ఎవరో వచ్చినట్టున్నారు. నేను వారిని తీసుకువస్తాను - ఈలోగా నీవు తిరగలి విసిరి పిండిని తయారు చేయి.

**లోయీ** : భగవాన్! ఈ ఇంటిలో అతిథి అభ్యాగతుల్ని ఆదరించే అదృష్టాన్ని కలిగించు స్వామీ!

(తిరగలి విసుర్తోంది. బయటినుండి జ్ఞానదేవ్, నామదేవ్‌లతో వచ్చాడు కబీరు)

**కబీ** : రండి! రండి! మా ఇంటిని పావనం చెయ్యండి!

**జ్ఞాన** : మా రాకవల్ల మీకే ఇబ్బంది కలగలేదు కదా!

కబీ : ఎంతమాట. జ్ఞానులైన నామదేవ్, జ్ఞానదేవ్‌లు మా ఇంటికి వస్తే ఈ పరిసరాలన్నీ పులకించి మరీ స్వాగతం పలుకుతాయి. అంతేగాని ఇబ్బంది ఏముంటుంది? చూసారా...! ఆ విసురురాయిని చూస్తే మీ ఇద్దరి భక్తీ, జ్ఞాన సముపార్జనే గుర్తుకొస్తున్నది.

నామ : ఏమిటా స్వారస్యం! చెప్పండి కబీర్‌దాస్!

కబీ : మీ ఇద్దరు ఆ విసురురాయిలాగే నిత్యం ప్రపంచాన్ని చుట్టి పరిభ్రమిస్తూ మీ హృదయాన్ని తాకిన ప్రతి అనుభవగింజ నుండి సారాన్ని పిండి, భక్తి జ్ఞాన సంపదను పిండిగా పంచుతున్నారే. మీ వంటి వారికి ఆతిథ్యం ఇవ్వడం కన్నా అదృష్టం ఎక్కడుంటుంది!

జ్ఞాన : కానీ ఆ విసురు రాయిని చూస్తుంటే, నాకేమనిపిస్తోందో తెల్సా! కబీరూ!

కబీ : ఏమనిపిస్తోందో చెప్పండి!

జ్ఞాన : స్త్రీ అనే మృత్యుదేవత కాలమనే తిరగలిలో, జొన్నలనే జీవుల్ని వేసి పిండి, పిండిచేస్తోంది. కబీర్‌దాస్! ఈ విధంగా మృత్యువు రక్కసి కోరలకు చిక్కి జీవులంతా మరణించాల్సిందేనా! దీనికి తరుణోపాయం లేదా కబీర్!

కబీ : లేకేం! ఉంది!

జ్ఞాన : ఏమిటది?

కబీ : రండి చూపిస్తాను. లోయీ! ఆ పైరాయిని తీసి ప్రక్కన పెట్టు.

లోయీ : అలాగే స్వామి! (పై రాయిని తీసి పక్కన పెట్టింది)

కబీ : ఈ లోపల నున్న కట్టుకొయ్యను చూడండి. ఈమె ఎన్నిసార్లు విసిరినా, ఈ దీనిచుట్టూ వున్న జొన్నలు నలిగాయా?

నామ్ : లేదు.

కబీ : ఎందుకని? కట్టుకొయ్యని నమ్ముకుని ఉన్నాయి గనుక. ఈ పరిధిని దాటి వెలుపలి ప్రపంచానికి రాలేదు గనుక. జీవులు కూడా భగవంతుడనే కట్టుకొయ్యను ఆశ్రయించుకుని ఉంటే, భౌతిక ప్రపంచంలోని ఆకర్షణలు ప్రలోభాలకు అతీతంగా ఉంటే, అలాంటి

వారికి జీవన మరణాలతో పనిలేదు. వారు పరమాత్మని సన్నిధిలో ఎప్పటికీ సజీవులే. వారిని మృత్యుస్పర్శ ఏమీ చేయలేదు.

**జ్ఞాన + నామ** : ఆహా! ఎంతబాగా చెప్పారు కబీర్‌దాస్!

**కబీ** : ఇప్పుడు మీరు మృత్యుదేవతతో పోల్చిన ఈమె ఎవరో తెల్సా? ఈ ప్రాపంచిక విషయాలన్నీ తను భరిస్తూ, నా భక్తిరసానుభూతికి జీవనాధారమైన, నా భార్య, పేరు లోయీ.

**జ్ఞాన** : అయ్యయ్యో! తెలియక...

**కబీ** : ఏం ఫర్వాలేదు! లోయీ! అతిథులకు చక్కని వంటలతో భోజనం సిద్ధం చెయ్.

**లోయీ** : ఏమండి! ఇటు రండి.

**కబీ** : ఏమిటి లోయీ!...

**లోయీ** : (ప్రక్కకు తీసుకెళ్ళి) సరుకులు నిండుకున్నాయి స్వామీ!

**కబీ** : దానికెందుకంత ఆలోచన లోయీ! దుకాణానికి వెళ్లి తీసుకురా..

**లోయీ** : అది కాదు స్వామీ! ఇప్పటికే మనమా తులసీ రామ్‌కు బాకీ ఉన్నాము... మళ్లీ అడిగితే ఇస్తాడా అని అనుమానం.

**కబీ** : అనుమానాలతో ఏ పనీ మొదలు పెట్టకూడదు. విషయం వివరిస్తే అతను మాత్రం కాదంటాడా? వెళ్ళు... వెళ్ళి అడుగు (లోయీ సంశయిస్తూనే వెళ్ళింది)

**కబీ** : (అతిథులవద్దకు వచ్చి) క్షమించాలి. ఏదో కాస్త చిన్న పని వుండీ...

**నామ** : కబీర్! రామనామ సంకీర్తన చేయడంలో నీకు నీవేసాటి అని చెప్పుకుంటారు. ఏదీ ఒక్కసారి మీ వీనుల విందుగా ఆ శ్రీరామ సంకీర్తన గావించు.

**కబీ** : మహాద్భాగ్యం స్వామీ!

(కీర్తన మొదలుపెట్టాడు. అతిథులు ఆనందంగా వింటున్నారు)

లైట్సాఫ్

## ఆరవ రంగం - ఎ

(తులసీరాం సేఠ్ ఇల్లు - లోయీ వచ్చింది)

**లోయీ** : (గుమ్మం ముందు నుంచుని) అయ్యా!.... అయ్యా!....

**తులసి** : (లోపలి నుంచి వచ్చి) నువ్వా లోయీ!... ఏమిటిలా వచ్చావు? నా బాకీ చెల్లించడానికి వచ్చావా?

**లోయీ** : (సంశయంగా) లేదయ్యా... కానీ...

**తులసి** : కానీ ఏమిటి! త్వరగా చెప్పు... అసలే నాకు దుకాణం మూసే వేళయింది.

**లోయీ** : ఏమీలేదయ్యా... అనుకోకుండా కొందరు అతిథులు ఇంటికి వచ్చారు. వారికి ఆతిథ్యమివ్వటానికి ఇంట్లో సరుకులు లేవు. తమరు దయతో కాస్త సరుకులు ఇప్పిస్తే - (తలపైకెత్తి లోయీని చూసాడు) అబ్బ... ఎంతందంగా వుందో.. (అనుకుని)

**తులసి** : చాలు - చాలు - ఇప్పటికే మీకు సరుకులు ఇచ్చీ ఇచ్చీ దివాలా తీసే పరిస్థితికి వచ్చాను. అయినా ఇరవై నాలుగ్గంటలూ రాముడూ, రాముడూ అని భజనలు చేస్తూ కూర్చుంటే కుటుంబం ఎలా జరుగుతుందన్న జ్ఞానం కూడా లేదా మీ ఆయనకు.

**లోయీ** : ఆయన్నేం నిందించకండయ్యా!... ఆయన యోగి పుంగవులు.

**తులసి** : ఆః.....ఆః.... ఆయనో యోగి. నువ్వో యోగి పెళ్ళానివి. అసలు తప్పు నీదికాదు. ఎందుకంటే మా నాయన చచ్చేముందు ఓ మాట చెప్పాడు. పది అణాలు అరువిచ్చే కన్న రెండు అణాలు దానమిచ్చేయ్యమన్నాడు. ఇచ్చిన అరువు తిరిగి వస్తుందో, రాదోననే అశాంతి కలుగచేస్తే, చేసిన దానం పుణ్యమేకదా అని మనశ్శాంతి కలుగచేస్తుంది. అతని మాట వినకుండా అరువిచ్చినందుకు నాకు తగిన శాస్తే జరిగింది. ఇక ఒక్క గింజ కూడా అరువు ఇవ్వను... పో...పో(తనలో) కొంపదీసి వెళ్ళిపోతుందా?

**లోయీ** : ఆయన్నే మనకండయ్యా!

తులసి : అఁ...అఁ....! ఆయన్నేమనకూడదు - అరువు మాత్రం ఇవ్వాలి. బాగుంది వరస.... పాతబాకీ చెల్లుబాటు చేయనిదే ఒక్క గింజకూడా అరువివ్వను వెళ్ళు... వెళ్ళు (తనలో) కొంపదీసి వెళ్ళిపోతుందా.

లోయీ : అలా అనకండయ్యా! ఇంటికి వచ్చిన వారికి ఆతిథ్యం ఇవ్వలేని స్థితి మాకు కల్పించకండి. ఎలాగయినా పెద్ద మనసు చేసుకుని సరుకులు ఇవ్వండి. త్వరలోనే మీ బాకీ చెల్లిస్తాము.

తులసి : ఎలా చెల్లిస్తారు చెప్పు. దమ్మిడీ ఆదాయం లేదు. పైగా వచ్చిపోయేవాళ్ళకు వండి వార్చడాలు. ఇక నా బాకీ ఏం చెల్లిస్తారు. వెళ్లవమ్మా! వెళ్ళు!

లోయీ : అంత నిర్దయగా మాట్లాడకండయ్యా! తల తాకట్టు పెట్టయినా మీ బాకీ తీర్చే పూచీ నాది. (తులసీరాం సేఠ్ లోయీ వంక దీక్షగా చూసాడు. ఓ వంకర నవ్వు నవ్వాడు)

తులసి : తలతాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు లోయీ! నువ్వు తల్చుకుంటే అసలు బాకీ అనేదే లేకుండా పోతుంది.

లోయీ : మీ మాటల్లోని అంతరార్థం నాకు బోధపడటం లేదయ్యా!

తులసి : వయసులో వున్నావు, అందులోనూ అవసరంలో వున్నావు. ఆమాత్రం అర్థం కాలేదా?

లోయీ : క్షమించాలి. అంతబుద్ధిశాలిని కాదు.

తులసి : బుద్ధిశాలివి కాకపోతేనేం... మహా అందగత్తెవు... నీ అందాన్ని ఈ రాత్రికి నా సొంతం చెయ్యి... నీకు కావల్సినన్ని సరుకులు ఉచితంగా తీసుకునిపో! (పిడుగు పడ్డట్టు అదిరిపోయింది లోయీ)

లోయీ : అయ్యా! ఇది మీకు ధర్మం కాదు. నా పేదరికాన్ని, అవసరాన్ని ఆసరాగా తీసుకోవడం మీ వంటి వారికి ఉచితం కాదు.

తులసి : ధర్మపన్నాలు అనవసరంలోయీ.. నీకు సరుకులు కావాలి. ఇవ్వగిలిగితే డబ్బిచ్చి తీసుకెళ్ళు. లేదా నీ అందాన్నిచ్చి తీసుకెళ్ళు. నేను వ్యాపారస్తుడిని. నాదగ్గరంతా ఇచ్చి పుచ్చుకొనే పద్ధతిలోనే వుంటుంది. నీకిష్టమైతేనే... ఇందులో బలవంతమేమీ లేదు.. బాగా ఆలోచించుకో...

**లోయీ** : అల్లా! ఏమిటీ పరీక్ష... ఓ పక్క అతిథులకు ఆహారం పెట్టలేని దౌర్భాగ్యం. మరోపక్క ఈ విషమ సమస్య... ఇప్పుడు నేనేం చెయ్యాలి.

**తులసి** : అంతగా ఆలోచించి ఆలస్యం చెయ్యకు. త్వరగా ఏదో ఒకటి తేల్చి చెప్పు. ఆలస్యమైతే మనసు మారిపోవచ్చు.

**లోయీ** : (ఒక నిశ్చయానికొచ్చి) అయ్యా! మలమూత్ర నిర్మితమైన, ఈ శరీరంపై మోజు పడ్డారా?.. అలాగే... తప్పక మీ కోరిక నెరవేరుస్తాను... కానీ... నాదో చిన్న విన్నపం మన్నించగలరా?

**తులసి** : ఏమిటది?

**లోయీ** : మలినమైన శరీరంతో సాధువులకు ఆతిథ్యమివ్వలేను. అది మహాపాపం... అందుకే వారికి ఆతిథ్యమిచ్చిన తరువాత వచ్చి మీ కోరిక తీరుస్తాను.

**తులసి** : మాట తప్పవుగా..

**లోయీ** : నేను పరమభాగవతోత్తముడైన కబీర్‌దాస్ అర్థాంగిని. ఇచ్చిన మాట తప్పి పాపం మూటగట్టుకోలేను. నన్ను నమ్మండి. తప్పక ఈ రాత్రికే మీ కోరిక తీరుస్తాను.

**తులసి** : అలాగే! నిన్ను నమ్మి సరుకులు ఇస్తున్నాను. తీసుకువెళ్ళి త్వరగా రా! (అంటూ లోపలికెళ్ళి గంపనిండా సరుకులతో వచ్చి లోయీ నెత్తిన పెట్టాడు)

**లోయీ** : మీ సహృదయతకు నమస్కారాలు

(అంటూ గంపనెత్తిన పెట్టుకుని వెళ్ళింది)

లైట్సాఫ్ అండ్ ఆన్

## ఆరవ రంగం - బి

(కబీరుదాసు ఇల్లు. అతిథులు అతనివద్ద సెలవు తీసుకుని వెళ్తున్నారు. లోయీ ఓ పక్కగా నిలబడి ఉంది)

నామ : కబీర్! నువ్వు ధన్యుడవు. ఇంత చిన్న వయస్సులోనే ఎంత ఆధ్యాత్మిక శక్తిని గ్రహించగలిగావయ్యా.

కబీ : అంతా తమవంటి సత్పురుషుల దయ....

జ్ఞాన : కడుపు నిండా కమ్మని భోజనం పెట్టావు. మనసునిండా జ్ఞానబోధ చేసావు. నీ ఆతిథ్యానికి ఎంతో సంతోషిస్తున్నాము. ఇక మేము సెలవు తీసుకుంటాం.

కబీ : (నమస్కరిస్తూ) తమ వంటి పెద్దలు ఈ పేదవాని గృహాన్ని పావనం చేయడం నిజంగా నా అదృష్టం స్వామీ....

(అతిథులు వెళ్ళిపోయారు. లోయీ మెల్లగా వచ్చి భర్త పాదాలకు నమస్కరించింది)

లోయీ : స్వామీ! నాకు శెలవిప్పించండి.

కబీ : (ఆశ్చర్యంగా) అదేమిటి లోయీ!.... ఇంత రాత్రివేళ ఎక్కడికెళ్తున్నావ్?

లోయీ : ఎక్కడికెళ్ళినా మళ్ళీ తిరిగిరాను. కనుకనే నాకు సెలవు ప్రసాదించమని వేడుకుంటున్నాను.

కబీ : నీ మాటలు నాకర్థం కావటంలేదు లోయీ!

లోయీ : స్వామీ! నేనిపుడు వాగ్దత్తను.... నాశరీరం పరాధీనం చెయ్యడానికి అంగీకరించినదానిని. ఇంకాసేపట్లో మలినం కాబోతున్న ఈ శరీరంతో ఇకపై మీ సేవ చేయలేను. అందుకే నాకు వెళ్ళటానికి అనుమతి ఇవ్వండి.

కబీ : లోయీ! నీ మాటలేంటో నాకు అర్థం కావటం లేదు. ఎంతో విషమ పరిస్థితి వస్తే తప్ప నువ్విలా మాట్లాడవు. అదేమిటో నాకు చెప్పవూ?

లోయీ : (నిశ్చలంగా) స్వామీ! మీరు చెప్పినట్టు నేను తులసీరాం దగ్గరకు వెళ్ళి సరుకులిమ్మని అర్థించాను. అతడు నా సౌందర్యాన్ని ఆశించి,

అందుకొప్పుకుంటేనే సరుకులిస్తానన్నాడు. ఆ సమయంలో అతిథుల సత్కారం తప్ప నాకు మరేదీ తోచలేదు. అందుకే తప్పని పరిస్థితులలో అతని షరతులకు తల ఒగ్గాను స్వామీ! (కబీరు వింటున్నాడు)

అవసరం తీరిన తర్వాత మాట తప్పడం తప్పుకదండీ! అందుకే ఈ రాత్రి అతనికోర్కె తీర్చటానికి వెళ్తున్నాను. (పాదాలపై పడింది) తర్వాత.. ఆ తర్వాత... మలినమైన శరీరంతో మీ సేవలు చేయలేనుకదండీ! అందుకే మాట నిలుపుకుని జీవితం ముగించటమే మంచిదని నిర్ణయించుకున్నాను. ఈ అభాగ్యురాలిని క్షమించండి. మీకు చేస్తున్న ద్రోహానికి మన్నిస్తారా స్వామీ!

**కబీ** : ఎంత ధన్యురాలివి లోయీ! ఈ శరీరాన్ని సాధనంగా ఉపయోగించి సాధు సత్పురుషులకు ఆహారాన్ని సమకూర్చావా? నవరంధ్రాలతో, మలమూత్రాలకు నిలయమైన ఈ దేహాన్ని ఉపయోగించి చేసే పవిత్ర కార్యం ఇంతకన్నా ఏముంటుంది లోయీ!

**లోయీ** : తులసీరాం మన బిడ్డలాంటివాడు. అతన్ని క్షమించమని దేవుణ్ని కోరుకుందామండీ!

**కబీ** : దేవుడు క్షమించడానికి తులసీరాం ఏ తప్పుచేశాడని?

**లోయీ** : స్వామీ!

**కబీ** : అవును లోయీ! అతనిలో నాకు రాముడే కన్పిస్తున్నాడు.

**లోయీ** : మీకు రాముడు కన్పిస్తున్నాడా?

**కబీ** : అవును లోయీ! తన కామ వాంఛను కూడా ఓ సత్కార్యం కోసం వినియోగించిన తులసీరాం పుణ్యాత్ముడు కాదంటావా! నిన్ను కోరుకునైనా సరుకులిచ్చాడు. అలా కాకుండా నిరాకరిస్తే ఏమి చేసేవాళ్ళం చెప్పు!

**లోయీ** : నిజమేనండీ! నిజమే తులసీరామ్ కూడా సత్పురుషుడే.

**కబీ** : పాపం అతడు నీ కొరకు ఎంతగా ఎదురు చూస్తున్నాడో పద! నిన్ను అతడి దగ్గరకు తీసుకెళ్తాను.

లైట్సాఫ్

# ఆరవ రంగం - సి

తులసీరాం సేఠ్ ఇల్లు...

(తులసీరాం లోయీ కోసం అసహనంగా ఎదురుచూస్తున్నాడు. లోయీ లోన ప్రవేశించింది)

**తుల** : లోయీ వచ్చేసావా!

**లోయీ** : వచ్చాను – ఇచ్చినమాట నిలబెట్టుకోవడానికి వచ్చాను తులసీరాం!

**తుల** : ఆశ్చర్యంగా ఉంది – నీవు వస్తావని అనుకోలేదు.

**లోయీ** : అయ్యా! వాగ్దాన భంగం మంచిదికాదుకదా! దాన్ని భగవంతుడు కూడా క్షమించడు. అందుకే నన్ను నేను స్వాధీన పర్చుకోవటం కోసం వచ్చాను.

**తుల** : ఆహా! ఎంతదృష్టం. ఇంత అందాన్ని నేనెన్నడూ చూసి ఎరగను. నిన్ను తాకాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది. తాకనా?

**లోయీ** : పువ్వు ఇష్టాఇష్టాలతో తోటమాలికి ఏం పనుంటుంది నాయనా. ఏది జరిగినా రాముని ఆజ్ఞగానే స్వీకరిస్తాను.

**తుల** : నా బాహువుల్లో నిన్ను బంధించి స్వర్గసుఖాలు అందుకోవాలని మనసు ఉబలాటపడుతోంది.

**లోయీ** : నీలో ఆడుకోవడానికి కత్తికావాలని అల్లరిచేసే బడుగుపిల్లవాడు కన్పిస్తున్నాడు తులసీరాం.

**తుల** : ఆఁ...ఆఁ... దగ్గరకొచ్చి చూడు. నేను బడుగునో, శృంగారంలో పిడుగునో నీకే అర్థమౌతుంది. అవునూ... ఇంతరాత్రివేళ... ఒంటరిగా ఇక్కడకు రావడానికి భయం వేయలేదా?

**లోయీ** : భయమెందుకయ్యా! తోడుగా నా భర్త ఉన్నాడుగా

**తుల** : ఆఁ కబీర్‌దాసా?

**లోయీ** : అవునయ్యా! మీరు విధించిన షరతుగురించి చెప్పాను. ఆయనే దగ్గరుండి మీ దగ్గరకు తీసుకువచ్చారు.

**తుల** : కబీర్‌దాస్... నిన్ను... నిన్ను... స్వయంగా తీసుకువచ్చాడా? ఏడీ!

**లోయీ** : బయట ఉన్నారు. అతిథులకు సత్కారం చేసే భాగ్యం కలిగించినందుకు మీకు కృతజ్ఞతలు చెప్పమన్నారు. మీలో ఆయనకు ఆ రాముడే కనిపించాడట! రా తులసీరాం! నువు నన్ను ఏం చేసినా, నా కొడుకు నా ఒడిలో ఆడుకుంటున్నట్టే భావిస్తాను. రా! నీ కోరిక...

**తుల** : (కంపించిపోయి) అమ్మా! నన్ను క్షమించు తల్లీ! (పాదాలమీద పడ్డాడు) ఈ పాపిని క్షమించుతల్లీ!

**లోయీ** : లే నాయినా!

**తుల** : నన్ను క్షమించానని చెప్పమ్మా!.... కామంతో కళ్ళు మూసుకుపోయిన నాలో మీకు రాముడు కనిపించాడా? ఆహా! మంచితనానికి, మానవత్వానికి రూపాలంటూ వుంటే అవి మీరేనమ్మా!... ఎక్కడమ్మా? కబీర్ ఎక్కడమ్మా! ఆ పుణ్యాత్ముడెక్కడ? (కబీరు లోనకు వచ్చాడు. తులసీరాం అతని పాదాలపైబడి ఏడుస్తున్నాడు)

**తుల** : నన్ను క్షమించు స్వామీ! కాముకుడినై ఉచ్ఛనీచాలు మర్చిపోయి ప్రవర్తించాను. ఈ పాపిని ఎలా దండిస్తారో మీ ఇష్టం స్వామీ!

**కబీ** : లే! నాయనా! ఎందుకంత క్షోభిస్తున్నావు. నువ్వు మాకెంత ఉపకారం చేసావో తెల్సా? జ్ఞాన సంపన్నులైన ఇద్దరు మహనీయులకు భోజనం పెట్టే అదృష్టాన్ని కల్పించావు – ప్రత్యుపకారంగా నీవామెను....

**తుల** : ఇంకా మాట అనకండి. నిజానికి నేనా కోరిక కోరినప్పుడే నా నాలుక ముక్కలు కావాల్సింది. ఈ పవిత్రమూర్తిని కామదృష్టితో చూసినప్పుడే నా కళ్ళు పేలిపోవాల్సింది. దుర్మార్గపు ఆలోచనతో, చెడు మాటలతో పాపభూయిష్టమైన ఈ శరీరాన్ని ఎన్ని గంగానదుల్లో ముంచి పవిత్రపర్చుకోగలను స్వామీ.

**కబీ** : వేయి చెడు ఆలోచనల పాపభారాన్ని ఒక మంచిపనితో పటాపంచలు చేయవచ్చు. ఇక్కడి నుండి సత్కర్మవ్రతుడివై జీవించు.

పరనారీపైనీచురి మత్‌కోయిలావో అంగ్
పరనారీకీ సంగ్ రావన్ దస్‌సీస్‌ఖో గయే.

ఇతరుల భార్య పదును పెట్టిన కత్తిలాంటిది. ఎన్నడు ఆశించకు. అలా ఆశించి రావణుడు తన పదితలకాయలు పోగొట్టుకున్నాడు. ఇకమీదట బుద్ధికలిగి సన్మార్గుడివై ప్రవర్తించు. ఆ రాముడు రక్షిస్తాడు.

**తుల** : అవును. ఒక్క సత్కర్మ చేసి సన్మార్గంలో నడుస్తాను. మీ శిష్యునిగా మారి మీకు సేవ చేయటమే జీవితాంతం చేయగల సత్కర్మ – దానికి అనుజ్ఞ ఇవ్వండి గురుదేవా!

(వంగి పాదాలకు నమస్కరించాడు. కబీరుదాసు అతని శిరస్సుమీద చేతులుంచి ఆశీర్వదించాడు. కబీరు పాడుకుంటూ వెళ్ళిపోయాడు. లోయీ, తులసీరాంలు అతడిని అనుసరించారు)

లైట్సాఫ్ అండ్ లైట్సాన్

# ఏడవ రంగం

(1వ రంగం మాదిరే)

**తులసీ** : ఇప్పుడు చెప్పండి. కబీరేమతస్థుడు

**కరీ** : అభీ బోలియే! గురూజీ కిస్‌కా.... ఆధ్యాత్మిక సారాన్ని నిలువెల్ల నిలుపుకున్న గొప్ప తాత్వికుడు కబీర్. అంతరంగ అవలోకనకై నిరంతరాన్వేషణ చేస్తూ, దుష్ట సాంప్రదాయాల బారిన పడిన సమాజంపై కత్తి ఝుళిపించిన కవన యోధుడు కబీర్‌దాస్.

**తులసీ** : కుహనాతాత్త్వికవేత్తల మాయాజాలంలోనూ, సామాజిక హోదాల ఇంద్రజాలంలోను చిక్కుపడినప్పుడు – మానవాళికి గొప్ప ఊరడింపు నిచ్చి సేదదీర్చిన అమృతమనస్కుడు కబీర్.

**కరీ** : స్థల కాలాతీతమైన మానవతాదృష్టితో విశాలమైన విశ్వసాహిత్య వేదికపై సూర్యచంద్రులున్నంత వరకు నిలచిపోయే తార్కిక తాత్వికుడు కబీర్‌దాస్.

**తులసీ** : స్వేచ్ఛా హృదయుడై, ఇంద్రియాతీతుడై, గ్రహరాశుల్ని దాటి వినువీధుల్లో ఆధ్యాత్మిక వీరవిహారం చేసిన ఆముష్మిక బాటసారి కబీర్‌దాస్.

**కరమ్** : ఈ గాలికి, నేలకు, నింగికి, నీటికి ఎలా మతం లేదో అలాగే కబీర్‌దాస్‌కి మతం లేదు – అతడికి కులం లేదు. (ఓ హిందువు, మరో ముస్లిమ్ వేదికపైకి వచ్చారు)

**హిందు** : అవును – కబీర్‌దాస్ మావాడు – మా మతాచారం ప్రకారమే దహన సంస్కారం చేస్తాం!

**ముస్లిం** : నహీ! కబీర్‌దాస్ హమారా! మా మాతాచారం ప్రకారం ఖననం చేస్తాం!

**ప్రేక్ష** : (ఓ ప్రేక్షకుడు పైకొచ్చి) లేదు – కబీర్‌దాసు హిందువూ కాదు, ముస్లింకాదు. అతడు అసలు సిసలైన మనిషి. మానవత్వం నిండిన మహామనీషి. అతడి మృతి ఆయన స్మృతిని దూరం చేయలేదు. గాలికెలా గోడలు కట్టలేమో! సముద్రాన్నెలా విభజించలేమో! అతని కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని మతం పేరున పంచుకోలేం. విద్వత్తును విభజించలేం? అతని స్మృతికి అంజలి ఘటిద్దాం – కవితా సుగంధాన్ని మనసారా ఆఘ్రాణిద్దాం. ఆధ్యాత్మిక భావసంపదకు వారసులుగా నిలుద్దాం. అంతటి మహానుభావుడు, భావుకుడు మన వాడైనందుకు గర్వపడుతూ అశ్రునయనాలతో ఆయనకు ఆఖరి వీడ్కోలు పలుకుదాం.

సమాప్తం